నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
ఆదివారం | ఏప్రిల్ 06, 2025 | www.navatelangana.com

7 టన్నుల పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-కంఠేశ్వర్



నగరంలోని ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలో జిల్లా టాస్క్ ఫోర్స్ టీమ్ దాడిలో ఏడు టన్నుల పిడిఎస్ రైస్ ను పట్టుకున్నట్లు టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ అంజయ్య తెలిపారు. అంజయ్య తెలిపిన వివరాల ప్రకారం.. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మాలపల్లిలో అశోక్ లేలాండ్ వాహనం లో రవాణా అవుతున్న 7 టన్నులు పిడిఎస్ రైస్ పట్టుకున్నట్లు తెలిపారు. పిడిఎస్ బియ్యం విలువ సుమారు 3,00,000 ఉంటుందన్నారు. వేకిల్ డ్రైవర్ షేక్ ఇమ్రాన్‌ను తదుపరి చర్య నిమిత్తం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వోకి అప్పగించినట్లు తెలిపారు.

యాప్‌లో లోన్ తీసుకొని బెట్టింగ్

- తీవ్రంగా నష్టపోవడంతో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య

నవతెలంగాణ-కామారెడ్డి



యాప్‌లోలోన్ తీసుకొని బెట్టింగ్‌లు పెట్టి మోసపోయిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా సదాశివనగర్‌కు చెందిన నిమ్మలబోయిన సందీప్(29).. హైదరాబాద్‌లో అల్వాల్‌లో ఉంటూ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. కాగా కొన్ని నెలల క్రితం లోన్‌యాప్ ద్వారా అప్పు తీసుకున్నాడు. బెట్టింగ్‌లో పెట్టి సుమారు రూ.20 లక్షలు నష్టపోయినట్టు సమాచారం. కాగా లోన్ తిరిగి చెల్లించలేకపోవడంతో సదరు లోన్‌యాప్ ఏజెంట్‌లు ఆయన ఇంటికి పలుమార్లు వెళ్లి నానా హంగామ సృష్టించారు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన యువకుడు.. హైదరాబాద్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. యువకుడికి ఐదు నెలల క్రితమే వివాహం జరిగింది.



ఎక్కడి ధాన్యం అక్కడే

- కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా.. తూకం కావట్లే
- ఒక వైపు అధికారులు ఆదేశిస్తున్నా.. పట్టని సిబ్బంది
- సౌకర్యాలు లేకపోవడంతో నిలిచిన సేకరణ
- వాతావరణంలో మార్పులతో రైతుల ఆందోళన

నవతెలంగాణ-నసురుల్లాబాద్

కొనుగోలు కేంద్రాలు అట్టహాసంగా ప్రారంభిస్తున్నా.. తూకం మాత్రం జరగట్లేదు. కేంద్రాలల్లో సౌకర్యాలు లేకపోవడంతో ధాన్యం సేకరణ ఇంకా ప్రారంభం కాలేదు. ఇప్పటికే పంట చేతికి వచ్చి ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు.. తూకం కోసం ఎదురుచూస్తున్నారు. ఇది వరకే రెండు సార్లు అకాల వర్షం పలకరించగా.. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకుంటుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసి తూకం వేసి ధాన్యం ఎప్పటికప్పుడు తరలించాలని ఒక వైపు కలెక్టర్‌తో పాటు ఉన్నతాధికారులు ఆదేశిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఆ విధంగా పనులు జరగడం లేదు. దీంతో ఎక్కడి ధాన్యం అక్కడే నిలిచిపోయింది.

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా ధాన్యం సేకరణకు 446 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికార యంత్రాంగం ప్రణళికలు రూపొందించింది. అయితే నిన్నటి వరకు కేవలం 33 కొనుగోలు కేంద్రాలు మాత్రమే ప్రారంభించినట్టు సమాచారం. సుమారు 17 వేల వరకు ధాన్యం బస్తాలు మాత్రం సేకరించి మిల్లులకు తరలించారు. కాగా జిల్లా వ్యాప్తంగా మిగతా చాలా చోట్ల కొనుగోలు కేంద్రాలు ప్రారంభంచినప్పటికీ ఇంకా తూకం ప్రారంభించకపోవడం గమనార్హం. ప్రతి కొనుగోలు కేంద్రంలో టార్పాలిన్ కవర్‌లు, తూకం మిషన్లు, తేమ కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్స్, క్యాలీ పర్స్‌లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. కూలీలను నియమించుకొని, లారీలను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాల్సి ఉన్నా.. ఆ విధంగా ఇంకా కొనుగోలు కేంద్రాల్లో ఏర్పాట్లు జరగలేదు. దీంతో తూకం ఇంకా ప్రారంభం కాలేదు.

ఆర్భాటంగా ప్రారంభం.. కొనుగోలుకు వెనకడుగు

బాన్సువాడ నియోజకవర్గంలో బీర్కూర్, నసురుల్లాబాద్ బాన్సువాడ మండలంలో గత 15 రోజుల రోజుల క్రితమే ఆయా గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కాని ధాన్యం కొనుగోలు చేసేవారు లేకపోవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద, పంట పొలాల్లో రహదారుల పైన కుప్పలు కుప్పలుగా ధాన్యం రాశులు పడి ఉన్నాయి.

బాన్సువాడ నియోజకవర్గ రైతులు ముందస్తుగా పంట సాగు చేయడంతో మార్చి రెండో వారం నుంచి ధాన్యం కోతలు ప్రారంభ య్యాయి. ఎంత ముందు పంట సాగు చేసిన అకాల వర్షంతో పంటలు దెబ్బతింటునే వస్తున్నాయి. గత నాలుగు రోజుల నుండి అకాల వర్షం కురియడంతో ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం నీటి పాలవుతుంది. కష్టపడిన ధాన్యం నీటి పాలు కావడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ధాన్యం కొనుగోలు త్వరగా ప్రారంభిస్తే కొంతవరకైనా రైతుల కష్టాలు తీర్చే అవకాశం ఉందని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారులకే తరలుతున్న ధాన్యం

గత 25 రోజుల నుంచి బాన్సువాడ నియోజకవర్గంలో వరి కోతలు ప్రారంభమై ఇప్పటికే సగంకు పైగా మంది రైతులు ప్రైవేటు దళారులకు ధాన్యం విక్రయించగా మరికొందరు రైతులు పంట నూర్పిడి చేసుకుని ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. ధాన్యం కొనేవారు లేక కల్లాల్లోనే రైతులు పడిగాపులు కాయాల్సి వస్తున్నది.

కస్టమ్ మిల్లింగ్ విషయంలో ప్రభుత్వంతో రైస్‌మిల్లర్లకు అవగాహన కుదరలేదు. దీంతో కేంద్రాల్లో కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎక్కడికి తరలించాలో తెలియని స్థితి నెలకొంది. మండలాల్లోని ఆయా గ్రామాల్లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలన్ని వరి ధాన్యంతో నిండిపోగా పంట నూర్పిడి చేసుకున్న రైతులు మిగతా ధాన్యాన్ని గ్రామం చుట్టూరా ఉన్న రోడ్లపై, ఇతర మైదానాల్లో ఆరబోసు కుంటున్నారు. ధాన్యానికి రక్షణ లేక రైతులు ఇబ్బందిపడుతున్నారు. వర్షాలు కురియడంతో ధాన్యం వర్షం నీటికి తడిసి ముద్దవుతుంది. కొందరు రైతులు మద్దతు ధర కంటే క్వింటాల్‌కు 400 నుంచి 600 వరకు తక్కువకు ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుంటున్నారు.

నసురుల్లాబాద్ మండలం మిర్జాపూర్, దుర్కి, నాచుపల్లి, మైలారం, నసురుల్లాబాద్, బైరపూర్, తదితర సొసైటీల సిబ్బంది ఇప్పటికే రైతులకు గోనెసంచులు సరఫరా చేయగా వర్షం కారణంగా ధాన్యం మ్యాచరింగ్ రాకం ఇబ్బందిగా ఉందని పలు సహకార సంఘ కార్యదర్శులు తెలిపారు.

ప్రభుత్వ మద్దతు ధర కన్న తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారు. మిల్లుల్లో ధాన్యం విక్రయాలు జరిపిన రైతులకు వెంటనే డబ్బులు కావాలంటే 2నుంచి 5 శాతం కటింగ్‌తో కొందరు మిల్లర్లు డబ్బులు చెల్లిస్తున్నారు. రోజురోజుకూ మారుతున్న వాతావరణ పరిస్థితులు, వర్షాలు కురుస్తుండడంతో వరి పంటను విక్రయించుకోలేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

కాగా పలువురు రైతులు కల్లాల వద్ద ధాన్యం ఆరబోశారు. ఇప్పటి వరకు కాంటాలు వేయలేదు. వేరే పని చేసుకోకుండా రోజంతా ఇక్కడే ఉండాల్సి వస్తుందని, రాష్ట్ర ప్రభుత్వం మళ్ళీ సన్న వడ్లకు ప్రభుత్వం 500 బోనస్ ఇస్తామని మళ్ళీ ప్రకటించడంతో బోనస్ కోసం రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పడి కాపులు కాస్తున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద సౌకర్యాలు కరువు

కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చిన రైతులకు అక్కడ ఎలాంటి వసతులు కల్పించడం లేదు. తాగునీటి వసతి, టార్పాలిన్లు, టెంట్లు, ధాన్యాన్ని తూర్పార పట్టేందుకు, జల్లి చేసేందుకు యంత్రాలు ఇప్పటి వరకు కేంద్రాల వద్ద ఏర్పాటు చేయలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల పట్ల ప్రభుత్వ అధికారులు చిన్నచూపు చూస్తున్నారని వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద కనీస సౌకర్యాలు ఏర్పాటు చేసి వెంటనే తూకం ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు.



రోడ్డు పక్కన ఆరబెట్టిన ధాన్యం

వీడీసీ వికృత చేష్ట.. ఆలయంలో పూజకు అడ్డగింత

- గౌడకులస్తులపై తాళ్లరాంపూర్ వీడీసీ దాష్టీకం
- పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసిన మహిళలు
- గ్రామకమిటీ సభ్యులపై, పూజారిపై కేసు నమోదు

నవతెలంగాణ-నిజామాబాద్ డెస్క్

ప్రస్తుతం నడుస్తున్న ఆధునిక యుగంలో టెక్నాలజీతో సమాజం అభివృద్ధిలో కొత్త పుంతలు తొక్కుతుంటే, పల్లెల్లో మాత్రం గ్రామ అభివృద్ధి కమిటీ(వీడీసీ)ల పేరిట ఆటవికత రాజ్యమేలుతోంది. నిజామాబాద్ జిల్లాలో ముఖ్యంగా ఆర్మూర్ డివిజన్‌లో చాలా గ్రామాల్లో వీడీసీ పేరిట వివిధ కులవృత్తులపై ఆంక్షలు విధిస్తూ గ్రామకమిటీలు పాశవిక ఆనందాన్ని పొందుతున్నాయి. వీడీసీలో ఉన్న ఆధిపత్య కులాలు ఒక్కో రూపంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక తరగతులపై తమ ఆధిపత్యం చేలాయించాలని చూస్తున్నాయి. తమ చెప్పు చేతల్లో లేని గౌడ కులస్తులపై గ్రామంలో ఆంక్షలు విధించిన వీడీసీ.. తాజాగా శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా పూజలు చేసేందుకు వెళ్లి ఆ సామాజిక తరగతికి చెందిన మహిళలను పూజలు చేయకుండా అడ్డగించిన వైనం వెలుగుజూసింది. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ఏర్గట్ల మండలం తాళ్లరాంపూర్‌లో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. తాళ్ళ రాంపూర్ గ్రామంలో గీత కార్మికులకు, గ్రామ కమిటీకి కల్లుగీత విషయంలో గత కొన్ని నెలలుగా గొడవలు జరుగుతున్నాయి. కల్లుగీస్తున్నందుకు ప్రతేడాదీ వీడీసీకి కొద్దిమొత్తంలో డబ్బులు చెల్లిస్తుండేవారు. అయితే ఈసారి పెద్దమొత్తంలో డబ్బులు కట్టాలని వీడీసీ హుకుం జారీ చేయడంతో అంతకట్టలేమని ప్రాధేయపడినా వీడీసీ సభ్యులు వినిపించుకోలేదు. దీంతో అప్పటి నుంచి గ్రామంలో గౌడ కులస్తులపై ఆంక్షలు కొనసాగుతున్నాయి.



స్టేషన్‌కు వచ్చిన మహిళలు

కాగా శ్రీరామ నవమి సందర్భంగా గ్రామంలో అన్ని కులాల వారు ప్రతి సంవత్సరం శ్రీరామ నవమికి చిన్నాపెద్దా అని తేడా లేకుండా ఉత్సవాల్లో పాల్గొంటారు. ఇదే విషయమై శనివారం గ్రామస్తులందరు కుంకుమార్చన కార్యక్రమంలో పాల్గొనాలని శుక్రవారం మైకులో చాటింపు వేయగా, గ్రామంలోని మహిళలందరితో పాటు, గౌడ సంఘానికి చెందిన మహిళలు కూడా కుంకుమార్చనలో పాల్గొనడానికి రామాలయంలోకి వచ్చారు. ఆలయంలోకి పూజ కార్యక్రమం కోసం గౌడ సంఘ మహిళలు వచ్చారని తెలుసుకున్న కొందరు గ్రామ కమిటీ సభ్యులు, ఆలయానికి చెందిన పూజారి.. సదరు మహిళలను పూజలో పాల్గొననీయకుండా అడ్డుకొని అవమానించారు. మనస్తాపానికి గురైన మహిళలు.. ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తమను పూజలు చేయకుండా అడ్డుకొని అవమానించారని తమ గోడు వెళ్లబోసుకున్నారు. పోలీస్‌లు తాళ్ళరాంపూర్ వెళ్ళి విచారణ చేపట్టి, ముగ్గురు గ్రామకమిటీ సభ్యులు, ఒక పూజరి మొత్తం నలుగురిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.

వివరాలు మెయిన్‌లో..

సమానత్వం కల్పించడమే నిజమైన నివాళి

- సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో బాబుజగ్జీవన్‌రామ్ జయంతి

నవతెలంగాణ-ఆర్మూర్

బడుగు బలహీన వర్గాలకు సమానత్వం, సమాన అవకాశాలు కల్పించినప్పుడే జగ్జీవన్ రామ్ ఆశయం నెరవేరినట్టు అవుతుందని సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్ అన్నారు. జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా శనివారం పట్టణంలోని మల్లేరు చెరువు కట్ట పైన ఉన్న జగ్జీవన్ రామ్ విగ్రహానికి సీపీఐ(ఎం) కమిటీ ఆధ్వర్యంలో పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాల పూర్తయిపోయినప్పటికీ దేశంలో అంటరానితనం దళిత ఎస్సీ ఎస్టీల పైన బడుగు బలహీన వర్గాల పైన మహిళల పైన దాడులు జరుగుతూనే ఉన్నాయని అన్నారు.



నివాళులర్పిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

దేశంలో రోజురోజుకు పేదరికం పెరుగుతూనే ఉందని పాలకవర్గాలు పెట్టుబడేదారులకి పెద్దపీట వేస్తూ వారి యొక్క ఆస్తులను గుట్టలు గుట్టలుగా పెంచుతున్నారు తప్ప దేశంలో పేదరికం నిర్మూలించడానికి ప్రయత్నం చేయడం లేదని అన్నారు. ప్రపంచ జనాభాలో మొదటి స్థానానికి చేరుకున్న మన దేశం పేదరికం నిర్మూలించటంలో వెనుకబడుతున్నామని అన్నారు.

పార్టీ పట్టణ కార్యదర్శి కుతాడి ఎల్లయ్య మాట్లాడుతూ బాబు జగ్జీవన్ రామ్ వ్యవసాయ శాఖ మంత్రిగా ఉన్నప్పుడు హరిత విప్లవం కోసం పోరాటాన్ని చేశాడని కొనియాడారు కార్మిక వర్గం కోసం హక్కులు కావాలని ఉద్యమం చేశానని అన్నారు. ఇప్పటికీ దేశంలో మతోన్మాదం ఉసిగొల్పి దేశ ప్రజల మధ్య శిక్ష పెడుతున్న పాలకవర్గానికి తగిన గుణపాఠం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు టి భూమన్న కుల్దీప్ శర్మ సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సామిల్‌లో అగ్నిప్రమాదం

- పూలాంగ్ చౌరస్తా వద్ద రాత్రి వేళ ప్రమాదం
- శ్రమించి మంటలు అదుపులోకి తీసుకొచ్చిన ఫైర్‌శాఖ

నవతెలంగాణ-కంఠేశ్వర్



నగరంలో పూలాంగ్ చౌరస్తాలో గల శంకర్ సామిల్‌లో శుక్రవారం అర్ధరాత్రి వేళ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఆ మంటలు పక్కన ఉన్న మరో రెండు దుకాణాలకు సైతం వ్యాపించాయి. సామిల్‌లో ఉన్న టేకు, ఇతర కట్టెలు అగ్నికి దగ్ధమైయ్యాయి. దీంతో పులాంగ్ ప్రాంతంలో దట్టమైన పొగలు అలుముకున్నాయి. కాగా స్థానికులు యజమానికి, ఫైర్ స్టేషన్‌కు సమాచారం అందించారు. స్థానికంగా ఉండే యజమాని రెండు నెలల కిందటే ఇల్లు మారడంతో ప్రమాదం తీవ్రతరం అయినట్టు సమాచారం. అప్రమత్తం అయిన అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైరింజన్‌లతో తెల్లవారు జాము 3 గంటల వరకు శ్రమించి మంటలు అదుపులోకి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య, ఏసిపి రాజ వెంకటరెడ్డి, ట్రాఫిక్ ఏసిపి టి.నారాయణ, సంబంధిత పోలీస్ సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని పర్యవేక్షించారు. ఎక్కడ కూడా ప్రాణ నష్టం జరగకుండా అన్ని రకాల చర్యలను చేపట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. అగ్ని ప్రమాదంఎలా జరిగిందనే కోణంలో దర్యాప్తు చేపట్టినట్టు సమాచారం.

స్పాట్ వ్యాల్యుయేషన్ డబ్బుల్లో కోత

- ఒక్కో టీచర్‌కు రూ.400-500 తక్కువ వచ్చిన వైనం

నవతెలంగాణ-కామారెడ్డి



గతేడాది పదోతరగతి పరీక్షల స్పాట్ వ్యాల్యుయేషన్ డబ్బులు తాజాగా శుక్రవారం సదరు టీచర్‌ల ఖాతాల్లో జమ అయ్యాయి. కాగా వారికి రావాల్సిన డబ్బుల కంటే ఒక్కో టీచర్‌కు రూ.300 నుంచి 500 వరకు తక్కువ వచ్చినట్టు సమాచారం. గత సంవత్సరం 2023-2024 పదవ తరగతి పరీక్షల స్పాట్ వ్యాల్యువేషన్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా వారికి నిజామాబాదు జిల్లా కేంద్రంలోని నిర్మల్ హృదయ పాఠశాలలో నిర్వహించింది. సుమారు 1500 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఒక్కో పేపర్‌కు 10 రూపాయలు చొప్పున రోజుకు 40 కంటే తక్కువ కాకుండా ఎన్నైనా పేపర్‌లు కరెక్షన్ చేయొచ్చు. సాధారణంగా ఒక రోజు 45-50 పేపర్‌లు కరెక్షన్ చేయగలుగుతారు. సోషల్ పరీక్ష పేపర్‌లు మాత్రం 80 వరకు కరెక్షన్ చేస్తుంటారు. మండు వేసవిలో అనేక ప్రయాసాల కోర్చి కామారెడ్డి నుంచి నిజామాబాద్ వచ్చి పేపర్ కరెక్షన్ చేస్తుంటామని, అక్కడ కనీస సౌకర్యాలు లేకున్నా ఇబ్బందులు పడుతూ కరెక్షన్ చేస్తుంటే ఇవ్వాల్సిన డబ్బులు ఏడాది తర్వాత ఇచ్చి అవి కూడా తక్కువ ఇవ్వడం పట్ల పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై విద్యాశాఖ అధికారులను ఆరా తీయగా.. వారికి సమాచారం లేదని చెబుతుండటం గమనార్హం.

బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలు అనుసరణీయం

- బడుగు బలహీన వర్గాలకు ఆయన చేసిన సేవలు మరువలేనివి
- జయంతి వేడుకల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

'బాబూ జగ్జీవన్ రామ్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. ప్రత్యేకించి యువతరం, విద్యార్థుల్లో స్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరం ఉంది. దేశ భవిష్యత్తు కోసం, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు జగ్జీవన్ రామ్ అందించిన సేవలు ప్రతి ఒక్కరికి ఆదర్శం. మహనీయుల గొప్పతనాన్ని, వారు చేసిన కృషిని భావితరాలకు తెలియజేస్తూ, వారిలో స్ఫూర్తిని నింపేందుకు ప్రభుత్వం అధికారకంగా నిర్వహిస్తున్న జయంతి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడ తాయని' నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల కలెక్టర్‌లు రాజీవ్‌గాంధీ హనుమంతు, ఆశిష్ సాంగ్వాన్, ప్రజాప్రతినిధులు తదితరులు అన్నారు. భారత మాజీ ఉపప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి వేడుకలను ఇరు జిల్లాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు.

కంఠేశ్వర్ : జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కంఠేశ్వర్ కమాన్ వద్ద గల పాత అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన జయంతి ఉత్సవాల్లో శాసన సభ్యులు సుదర్శన్ రెడ్డి, రాకేశ్ రెడ్డి, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, అదనపు కలెక్టర్‌లు అంకిత్, కిరణ్ కుమార్ తదితరులు బాబూ జగ్జీవన్ రాం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం పాత అంబేద్కర్ భవన్ లో నిర్వహించిన జయంతి కార్యక్రమంలో పాల్గొని బాబు జగ్జీవన్ రాం చేసిన సేవలను కొనియాడారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లా డుతూ.. మహాత్మా గాంధీ, అంబేద్కర్, జగ్జీవన్ రామ్, పూలే వంటి మహనీయుల కృషి ఫలితంగానే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి, నేడు మనమంతా గౌరవప్రదమైన స్థితిలో జీవనాలు వెళ్లదీస్తున్నామని అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ ఎన్నో ఉన్నత పదవులను అధిరోహించారని, తాను చేపట్టిన ప్రతి పదవికి వన్నె తెచ్చారని కొనియాడారు. మహనీయుల గురించి తెలుసుకొని, వారి అడుగుజాడల్లో నడిచేందుకు ప్రయత్నించాలని పిలుపునిచ్చారు. దళిత సంఘాలు ఆత్మ గౌరవానికి ప్రతీకగా భావిస్తున్న పాత అంబేద్కర్ భవనం మరమ్మతులకు వారం రోజుల్లోనే రూ. 5 లక్షల నిధులు విడుదల చేస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. అంతేకాకుండా వచ్చే సంవత్సరం జయంతి నాటికి ఈ భవనాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఆధునీకరించేలా చర్యలు తీసుకుంటామని అన్నారు.



నిజామాబాద్‌లో నివాళి అర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు, నాయకులు

ఎమ్మెల్యేలు సుదర్శన్ రెడ్డి, రాకేశ్ రెడ్డి, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్ లు మాట్లా డుతూ, దేశానికి ఎన్నో విధాలుగా సేవలం దించిన మహనీయుడు బాబు జగ్జీవన్ రాం అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు.



కామారెడ్డిలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్

కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అభివృద్ధి అధికారిణి నిర్మల, ఎస్సీ కార్పొరేషన్ ఈ.డీ రమేష్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్ర కుమార్, ఏసీపీ రాజా వెంకట్ రెడ్డి, టీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి : బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శనివారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో వేడుకలను నిర్వహించారు.

జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్ కుమార్ పలు సంఘాల ప్రతినిధులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు మాట్లాడుతూ ఇలాంటి మహా నాయకుల జయంతులకు ప్రతి గురుకుల, వసతి గృహాలలో చదువుకునే విద్యార్థిని విద్యార్థులకు ఆ మహా నాయకుల గురించి వివరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డ్రానస్ మాస్టర్ సాయి మౌర్య జై భారత్ జై భీమ్ టీం ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్కృతి కార్యక్రమం పలువురుని అలరించాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర్, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారిని రజిత, ఆర్డీఓ వీణ, ఎస్సీ కార్పొరేషన్ ఈడి దయానంద్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, వివిధ కుల సంఘాల నాయకులు, దళిత నాయకుడు సంపత్, బివిఎం విటల్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షురాలు సత్తి గారి లక్ష్మి, నాయకులు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగాన్ని సమీక్షించని ప్రభుత్వానికి పరిపాలించే హక్కు లేదు

- విద్యాశాఖకు మంత్రిని కేటాయించని కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలి
- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్



మాట్లాడుతున్న దామెర కిరణ్

నవతెలంగాణ-కంఠేశ్వర్

'విద్యారంగాన్ని సమీక్షించని ప్రభుత్వానికి పరిపాలించే హక్కు లేదు. విద్యాశాఖకు మంత్రిని కేటాయించని కాంగ్రెస్ ప్రభుత్వం దిగిపోవాలని' ఎస్ఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి దామెర కిరణ్ అన్నారు. శనివారం భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) స్థానిక నాందేవాడలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరై ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే విస్మరణకు గురైన విద్యారంగం అభివృద్ధి అవుతుందనుకుంటే.. రేవంత్‌రెడ్డి సర్కార్ భిన్నంగా విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం బాధాకరమని అన్నారు. విద్యా శాఖకు మంత్రి లేకపోతే విద్యాశాఖకు సంబంధించిన అంశాలపై రివ్యూ లేకుండానే ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తుందని, ఇది అప్రజాస్వామికమని అన్నారు.

ఒకపక్క విద్యార్థులు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై పోరాటాలు నిర్వహిస్తే ప్రభుత్వం నిర్బంధించడం సబబు కాదని అన్నారు. విద్యారంగాన్ని సమీక్షించని ప్రభుత్వానికి పరిపాలించే హక్కు లేదని అన్నారు. అదేవిధంగా ప్రైవేట్ కార్పొరేట్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం కాకుండా ఇంటర్ విద్యాశాఖ అధికారుల పొద్దులంతో కళాశాలను అడ్మిషన్లు చేస్తున్నాయని వాటిని నివారించాల్సిన అవసరం ప్రభుత్వానికి ఉన్న పట్టనట్టు వివరించడం దారుణమని అన్నారు. అదేవిధంగా రాష్ట్ర యూనివర్సిటీలకు వెయ్యి కోట్ల బడ్జెట్ కేటాయించాలని అడిగితే 500 కోట్ల కేటాయించడం సిగ్గుచేటని అన్నారు. విద్యారంగానికి మంత్రిని కేటాయించి.. ప్రభుత్వ విద్యారంగ అభివృద్ధికి కృషి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దీపిక, విగ్నేష్, జిల్లా ఉపాధ్యక్షులు దినేష్, నగర కార్యదర్శి చక్రి యూనివర్సిటీ అధ్యక్షులు శివ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆలయాన్ని దర్శించుకున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

నవతెలంగాణ-బాల్కొండ

జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, ఆర్మూర్ మెజిస్ట్రేట్ వేముల దీప్తి శనివారం మండల కేంద్రంలోని మహంకాళి మాత ఆలయాన్ని దర్శించుకున్నారు. ఆలయం వద్ద అమ్మవారిని దర్శించుకుని వారు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బూస నరహరి, జగన్, గంగారం, మాజీ సర్పంచ్‌లు బూస సునీత, తౌచిట్ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఖిల్లా రఘునాథ ఆలయంలో సీపీ ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖిల్లా రఘునాథ ఆలయంలో శనివారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయాల్లోని దేవతామూర్తులకు అభిషేకాలు, ప్రత్యేకార్చనలు చేశారు.


ఆలయం వద్ద సీపీ

రామచంద్రపల్లిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండలంలోని రామచంద్రపల్లి గ్రామంలో కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ వినయ్‌రెడ్డి ఆదేశాల మేరకు శ్మశాన వాటిక దగ్గర సిసి రోడ్డు నిర్మాణ పనులను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ.. నిధుల మంజూరుకు కృషిచేసిన వినయ్‌రెడ్డికి గ్రామ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్రలో విద్యార్థులు



విహారయాత్రలో పాల్గొన్న విద్యార్థులు

నవతెలంగాణ-భీంగల్ రూరల్

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు బాసరలోని సరస్వతి దేవి మందిరాన్ని దర్శించుకుని అనంతరం అక్కడే ఉన్న ట్రిబుల్ ఐటీ విద్యాలయాన్ని సందర్శించారు. సారంగాపూర్‌లోని హనుమాన్ ఆలయాన్ని సందర్శించారు. విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలో విద్యతో పాటు, టూర్ల రూపంలో జనరల్ నాలెడ్జ్ పెంపొందించే విధంగా చూస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లింబాద్రి, వాసుదేవ్, ఇమాన్యుయల్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కల్పే చిరంజీవి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని వర్ని చౌరస్తా వద్ద కల్పే చిరంజీవి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కల్పే చిరంజీవి మాట్లాడుతూ.. అధిక ఉష్ణోగ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులకు, విద్యార్థులకు రోజువారి కూలీలకు ఇలాంటి చలివేంద్రం ఉపయోగపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బుస్సాపూర్ శంకర్, సంకరి నారాయణ, సాయివర్ధన్, మున్సిపల్ ఎస్సై నీరటి మహిపాల్, తులసిరామ్, శ్రావణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, హరికృష్ణ, సతీష్, సుస్మిత్‌గౌడ్, శంకర్, రామగౌడ్, రంగచారి, నవీన్, రాకేష్ పాల్గొన్నారు.

తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా ప్రేమలాల్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ టీచర్ రచయిత బానోత్ ప్రేమలాల్‌ను తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమించిన్నట్లు రాష్ట్ర అధ్యక్షులు కామిడి సతీష్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో వారి ని నియమించినట్లు పేర్కొన్నారు. సామాజిక సమస్యల మీద రచనలు చేస్తూపలు పత్రికలకు వ్యాసాలు రాయడంలో వారు దిట్ట అన్నారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ.. సమాజానికి మార్గదర్శకులు రచయితలు అని తెలిపారు. ఒక్క సిరా చుక్క లక్ష మెదల్ల కలయిక అని అన్నారు. సామాజిక అంశాల మీద రచయితలు రచనలు చేయాలని పేర్కొన్నారు. తనను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియామకం చేసిన సతీష్‌రెడ్డికి తెలంగాణ సామాజిక రచయితల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రేమలాల్ కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీరామనవమికి ముస్తాబైన సిద్దుల గుట్ట


గుట్టను ముస్తాబుచేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణంలోని శ్రీ నవనాథ సిద్దుల గుట్ట వద్ద శ్రీరామనవమి సందర్భంగా శనివారం కళ్యాణానికి రామాలయం ముందర పచ్చటి మామిడి తోరణాలతో కళ్యాణ పందిరి వేశారు. ఈ కార్యక్రమానికి శ్రీశ్రీ నందీశ్వర మహారాజు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ వినయ్‌రెడ్డి, పండిత్ పవన్ పాల్గొని వేద మంత్రోచ్చారణాల మధ్య పందిరి వేశారు. భద్రాచలంలో ఏ విధంగా సీతారాముల కళ్యాణం జరుగుతుందో అదే విధంగా అంగరంగ వైభవంగా ఉదయం నుంచే అన్నప్రసాద వితరణ, కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. సిద్దులగుట్టకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సీలింగ్ టెంట్లు, చల్లటి మంచినీళ్లను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బి.సుమన్, పిసి గంగారెడ్డి, ప్రశాంత్‌గౌడ్, హజారి సంతోష్, కొంతం మంజుల, మురళి, చరణ్‌రెడ్డి, సిద్దులగుట్ట సేవా భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మన రాజ్యాంగాన్ని కాపాడుకుందాం


ఆర్మూర్: వినయ్‌రెడ్డిని సన్మానిస్తున్న పలువురు


జక్రాన్‌పల్లిలో..


మోపాల్ మండలంలో..

- నియోజకవర్గ ఇంచార్జి వినయ్ కుమార్ రెడ్డి
- మచ్చర్లలో జైబాపు, జై సంవిధాన్ ముగింపు

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఆర్మూర్ : మన రాజ్యాంగాన్ని మనం కాపాడుకుందాని, మనకు అహింస శాంతి సిద్ధాంతాలను అలవర్చిన మహాత్మాగాంధీని స్మరించుకుందామని, రాజ్యాంగాన్ని రచించి ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా అందరికీ సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఆలోచనలు కాపాడుకుందామని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జ్ పొద్దుటూరి వినయ్‌కుమార్ రెడ్డి అన్నారు. ఆలూర్ మండలంలోని మచ్చర్ల గ్రామంలో జై బాపు, జైభీం, జై సంవిధాన్ ముగిపు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీసీసీబీ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్‌రెడ్డి పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో కరపత్రాలు పంచి కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ కార్యకమంలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్ మునిపల్లి సాయిరెడ్డి, ఆలూర్ కాంగ్రెస్ మండల ముక్కెర విజయ్, సమీర్, జితేందేర్‌రెడ్డి, పస్క నర్సయ్య హసన్న, నరేష్‌గౌడ్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

మామిడిపల్లిలో గడపగడపకు జై భీమ్..

మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో జై భీమ్, జై బాపు, జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ పొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిబాబా గౌడ్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని రక్షించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని కలిసికట్టుగా పోరాడుదామని అన్నారు. ప్రధాన వీధులలో పాదయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పండిత్ పవన్, మాజీ కౌన్సిలర్లు కోన పత్రి కవిత కాశిరాం, మేడిదాల సంగీత రవి గౌడ్, ఆకుల రాము, మాజీ సర్పంచ్ మారుతి రెడ్డి, సాయిరెడ్డి, ఎం.నారాయణ, శ్యామ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు రక్షణ కవచమే భారత రాజ్యాంగం..

కమ్మర్‌పల్లి : బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పినట్లుగా బాధితులకు రక్షణ కవచమే భారత రాజ్యాంగమని నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఐడీసీఎంఎస్ చైర్మన్ బాదావత్ తారచంద్ నాయక్ అన్నారు. ప్రజల భవిష్యత్తు కోసం రాజ్యాంగం ఒక వాగ్దానంగా నిలబడిందని తెలిపారు. మండల కేంద్రంలోని పద్మశాలి కళ్యాణ మండపంలో నిర్వహించిన జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు గ్రామంలో మన దేశ ఉజ్వల భవిష్యత్తు కోసం మన నినాదం జై బాబు, జై భీమ్, జై సంవిధాన్ అంటూ నినాదం చేస్తూ నాయకులు, కార్యకర్తలతో కలిసి పాదయాత్ర చేశారు. గ్రామంలోని మహాత్మాగాంధీ విగ్రహానికి, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించి నినాదాలు చేశారు. అనంతరం పద్మశాలి కళ్యాణ మండపంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ ముగింపు సభ కార్యక్రమంలో బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్‌రెడ్డి గారితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐడీసీఎంఎస్ చైర్మన్ బాదావత్ తారచంద్ నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అంటే ప్రజల పార్టీ అని తెలిపారు. అనంతరం ఐడీసీఎంఎస్ చైర్మన్ బాదావత్ తారచంద్ నాయక్, బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముత్యాల సునీల్ రెడ్డిని నాయకులు కార్యకర్తలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నరసయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బుచ్చన్న, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ నిమ్మ రాజేంద్ర ప్రసాద్, మాజీ ఎంపీపీ గుడిసె అంజమ్మ మండల కోశాధికారి నూకల బుచ్చి మల్లయ్య, మండల పార్టీ జనరల్ సెక్రెటరీ సుంకేట శ్రీనివాస్, మండల పార్టీ యూత్ వైస్ ప్రెసిడెంట్ కౌడ శైలేందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్, పూజారి శేఖర్, వాల్గోట్ రంజిత్, సింగిరెడ్డి శేఖర్, గణేష్, హజార్, దూలూరు కిషన్ గౌడ్, వేములవాడ జగదీష్, సల్లూరు గణేష్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మోపాల్ : నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, మండల అధ్యక్షుడు సాయిరెడ్డి ఆధ్వర్యంలో మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లి, మంచిప్ప, బైరాపూర్, కల్పోల్, శ్రీరాంనగర్ తండాలలో జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటగా గ్రామాలలోని అంబేద్కర్, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి మాట్లాడుతూ.. గతంలో స్వతంత్రం కోసం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోనే ఎన్నో ఉద్యమాలు చేసి మహాత్మాగాంధీ సిద్ధాంతాలైన సత్యం, అహింసా, ధర్మం ప్రజలలోకి తీసుకెళ్తూ, దేశంలోని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నవసమాజ నిర్మాణం కోసం అంబేద్కర్ రాజ్యాంగాన్ని రాసి వారి ఆశయ సాధనకు ప్రతి పౌరుడు కృషిచేసి రాజ్యాంగంలో పొందుపరిచిన విషయాలను ప్రజలందరికీ వివరించాలన్నారు. భారత దేశంలోని ప్రతి పౌరుడు హక్కులను రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని ఆయన అన్నారు. అనంతరం మంచిప్ప గ్రామంలో సొసైటీ ద్వారా ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బాడ్సి సొసైటీ చైర్మన్ నిమ్మల మోహన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కచ్చితంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు తమ పంటను విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని తెలిపారు. కార్యక్రమంలో మోపాల్ మండలాధ్యక్షులు సాయిరెడ్డి, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షులు రాజేష్, సాయిరాం, విట్టల్, గోవింద్, సురేష్, భూపతిరెడ్డి, వెంకట్‌రామ్ నాయక్, మిట్య నాయక్, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని మూడు గ్రామాల్లో జైబాపు, జైభీమ్, జైసంవిదాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని బ్రాహ్మణపల్లి, తొర్లికొండ, కొలిప్యాక గ్రామాల్లో పాదయాత్రను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలాఅధ్యక్షులు చిన్నారెడ్డి, రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సోప్పరీ వినోద్, ఆర్మూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనక రవి, బ్రాహ్మణపల్లి సొసైటీ చైర్మన్ నర్సారెడ్డి, అర్గుల్ సొసైటీ చైర్మన్ ఆర్మూర్ గంగారెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి వసంతరావు, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అనుపాల్ కిరణ్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వెంకటేష్, కొలిప్యాక్ శ్రీనివాస్, గంగన్న, మనోరాబాద్ బాలయ్య, బ్రాహ్మణపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడు గోడ సాగర్, పద్మారావు, శేఖర్, అబ్బాస్ , శంకర్ తొర్లికొండ గ్రామ ప్రధాన కార్యదర్శి వినోద్, జై గంగారం, కలిగోట గంగాధర్, అశోక్, నాయకులు, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భీంగల్ రూరల్ : పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణ అధ్యక్షులు జె జె నర్సయ్య ఆధ్వర్యంలో పదో వార్డులో పాదయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు కల్పన, పర్స అనంతరావు, గణేష్, నాగేంద్ర, రాగుల మోహన్, పట్టణ అధ్యక్షులు జెజె నర్సయ్య, మండల అధ్యక్షులు బోదిరే స్వామి, కాంగ్రెస్ పార్టీ యూత్ జిల్లా అధ్యక్షులు నాగేంద్రబాబు, యూత్ మండలాధ్యక్షులు అవినాష్, యూత్ నాయకులు వాకా మహేష్, యూత్ మండల ఉపాధ్యక్షులు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవిద్య సాయి పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలోని హాసకొత్తూర్ రోడ్డులో గల శ్రీ విద్యాసాయి ఉన్నత పాఠశాలను రాష్ట్ర మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి శనివారం సందర్శించారు. పాఠశాలను నెలకొల్పి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న వేడుకల్లో పాలు పంచుకోవాలని కోరుతూ పాఠశాల యాజమాన్యం ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి శ్రీ విద్యాసాయి ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల యాజమాన్యానికి, ఉపాధ్యాయ బృందానికి వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డిని పాఠశాల యాజమాన్యం, కరస్పాండెంట్ ఏనుగు గంగారెడ్డి దంపతులు శాలువాతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పెరుమండ్ల రాజాగౌడ్, బిఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షులు రేగుంట దేవేందర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాలావత్ ప్రకాష్, మాజీ ఎంపీటీసీ సభ్యులు అంగరి రాజేశ్వర్, మైలారం సుధాకర్, మాజీ సర్పంచ్ గడ్డం స్వామి, నాయకులు రెంజర్ల మహేందర్, కటికే శ్రీనివాస్, పాఠశాల డైరెక్టర్ ఏనుగు ప్రమీల గంగారెడ్డి, ఉపాధ్యాయ బృందం సభ్యులు పవన్, శ్రీనివాస్, షాలిని, జాన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న పాఠశాల యాజమాన్యం


ముస్తాబవుతున్న సాయిబాబా ఆలయం



నవతెలంగాణ-మోపాల్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మాధవనగర్ సాయిబాబా దేవస్థానం శ్రీరామ నవమి సందర్భంగా జరిగే శ్రీ సాయి బాబా జన్మదిన వేడుకలకు అంగరంగ వైభవంగా ముస్తాబు చేస్తున్నారు. ఈ శ్రీరామనవమి వేడుకలకు జిల్లా నుండే కాక జిల్లా నలుమూలల నుండి వివిధ ప్రాంతాల నుండి వేలాది మంది భక్తులు తరలివస్తుంటారు. ఆలయ ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసిపోతుంది. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీరాం రవీందర్ మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా శ్రీరామనవమి సందర్భంగా అంగరంగ వైభవంగా బాబా వారి జన్మదిన వేడుకలను నిర్వహిస్తామని తెలిపారు. శ్రీరామనవమి రోజున ఉదయం 5:15 గంటలకు కాకడ హారతి, 5:45 మహాగణపతి పూజ, 6.00 బాబాభిషేకం, 7:00 హారతి, 7:15 సాయిబాబా నామస్మరణ, 9:30 బాబా జన్మదిన వేడుకలు (డోలారోహణము), 12:05 శ్రీ సీతారాముల దివ్య కళ్యాణోత్సవం, సాయంత్రం 5:00 సాయిబాబా ప్రత్యేక పల్లకి సేవ, సాయంత్రం 6:00 శ్రీ సీతారామచంద్ర సమి వారి ఊరేగింపు మహోత్సవం ఉంటుందని ఆలయ అర్చకులు కే మాణిక్య శర్మ, హరికృష్ణ తెలిపారు. అలాగే ఆదివారం పలు కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నేడు పీసీసీ అధ్యక్షులు రాక


మాట్లాడుతున్న ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-మోర్తాడ్

బాల్కొండ నియోజకవర్గానికి పిసిసి అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ ఆదివారం రానున్నట్లు బాల్కొండ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రజానిలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భీంగల్ మండలంలోని పిప్పిరి గ్రామంలో గల లొద్దిరామన్న ఆలయంలో మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించినట్లు తెలిపారు. పిసిసి బాధ్యతలు స్వీకరించిన అనంతరం మొట్టమొదటిసారిగా తొలిసారిగా నియోజకవర్గానికి విచ్చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి ఆహ్వానం పలకాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

నవతెలంగాణ-మోర్తాడ్

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని సంఘం అధ్యక్షుడు అశోక్ రెడ్డి, మానిటరింగ్ అధికారి నర్సింగరావు అన్నారు. శనివారం సహకార సంఘం ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. దళారులకు ధాన్యాన్ని విక్రయాలు జరిపి మద్దతు ధర, మోసపోయే పరిస్థితి అధికంగా ఉందని అలా కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని అన్నారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2300 మద్దతు ధర చెల్లిస్తున్నామని వివరించారు. రైతులు తప్పనిసరిగా 17 తేమ శాతం ఉండేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు నవీన్, మహిపాల్, మల్లేష్, అశోక్, నవీన్, గంగాధర్, సంఘం కార్యదర్శి కాశీరాం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-మెండోరా

మెండోర మండలంలోని నడిమి తండాలో సిసి రోడ్ల పనులను వేల్పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తింటి ముత్యంరెడ్డి ప్రారంభించారు. తండాకు సిసి రోడ్లు నిర్మాణానికి నిధులు మంజూరు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తండా వాసులు కతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వేల్పూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మహిపాల్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, రవి, సంగ్ నాయక్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇంటాస్ ఫౌండేషన్ సహకరంతో హిమోఫిలియా సదస్సు

- సొసైటీ నిజామాబాద్ చాప్టర్ ఆధ్వర్యంలో సదస్సు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ నగరంలోని మారుతినగర్‌లో గల స్నేహ సొసైటీ ప్రాంగణంలో ఇంటాస్ ఫౌండేషన్ వారి సహకారంతో ఆదివారం హిమోఫిలియా సొసైటీ నిజామాబాద్ చాప్టర్ వారు నిర్వహిస్తున్న ఈ సదస్సుకు హిమోఫిలియా వ్యక్తులు/బాధితులు అందరూ వారి తల్లి/తండ్రి/పోషకులలో ఎవరినైనా వెంటబెట్టుకుని రావాలని హిమోఫిలియా సొసైటీ నిజామాబాద్ చాప్టర్ విజయ్ ఆనంద్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటాస్ ఫౌండేషన్ వారు ఒక్కొక్క హిమోఫిలియా వ్యక్తికి 1000 యూనిట్ల ఫ్యాక్టర్ -8 ఉచితంగా ఇస్తారని పేర్కొన్నారు. హిమోఫిలియా ఇన్హిబిటర్స్ పరీక్షలు నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ నీలి రామచందర్ పిల్లల వైద్య నిపుణులు, డాక్టర్ రవీంద్రనాథ్ సూరి వైద్యులు పాల్గొంటారని తెలియజేశారు. సమయం ఆదివారం ఉదయం 9:30 గంటలకు స్నేహ సొసైటీ మారుతినగర్‌లో ప్రారంభమవుతున్నందున సకాలంలో ప్రతి ఒక్కరూ హాజరుకావాలని సూచించారు.

విహారయాత్రలతో విద్యార్థులకు విజ్ఞానం

నవతెలంగాణ-బాల్కొండ

విహార యాత్రలతో విద్యార్థులకు విజ్ఞానం పెంపొందుతుందని బస్సాపూర్ హెచ్ఎం డి.రాజారాం అన్నారు. మండల పరిధిలోని బస్సాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం విహారయాత్రలకు వెళ్లారు. జిల్లాలోని ఖిల్లా రామాలయం, అంకాపూర్ వాటర్‌ఫాల్స్, ఫన్ జోన్ తదితర పర్యాటక ప్రాంతాలకు విద్యార్థులను తీసుకెళ్లి అక్కడి విశేషాలను ఉపా ధ్యాయులు వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం రాజారాం, ఉపాధ్యాయులు బోయడ నర్సయ్య, సాయన్న, రమాదేవి, తిరుపతి విద్యార్థులు పాల్గొన్నారు.


విహారయాత్రలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
3
ఆదివారం | ఏప్రిల్ 06, 2025 | www.navatelangana.com

సమస్యలు పరిష్కరించండి

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

తమ గ్రామ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ పోచారం గ్రామ అధ్యక్షుడు వేముల కిరణ్, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావును తన నివాసంలో కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం శనివారం అందజేశారు. ఎల్లమ్మ గుడి నుంచి ప్రాజెక్టు వెళ్లే దారిలో బతుకమ్మ మెట్లు నిర్మించాలని, అదేవిధంగా గుడి వద్ద తాగునీటి కొరకు బోరును ఏర్పాటు చేయాలని, ఎన్నో రోజుల నుంచి పెండింగ్‌లో ఉన్న పట్టాపాసు పుస్తకాలు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యే సమస్యలు వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు ఆయన తెలిపారు.


ఎమ్మెల్యేకు విన్నపం

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని తాడ్‌బిలోలి, నీలా గ్రామాలలో సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి శనివారం పంపిణీ చేశారు. నిరుపేద కుటుంబాలకు సీఎం సహాయనిధి నుంచి ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం ఈ చెక్కులను అందజేయనున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మోబిన్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

బాబు జగ్జీవన్ రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలి


ఎడపల్లి :నివాళ్లు అర్పిస్తున్న మాజీ ఎంపిటీసి, పలువురు


తాడ్వాయిలో..


నసురుల్లాబాద్‌లో..

- మాజీ ఎంపీటీసీ బుడ్డ విజయలక్ష్మి

నవతెలంగాణ-విలేకరుల బృందం

ఎడపల్లి : నేటి యువత బాబు జగ్జీవన్ రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ ఎంపిటిసి బుడ్డ విజయలక్ష్మి అన్నారు. శనివారం మండలంలోని మంగల్ పహాడ్, కుర్నపల్లి ఆయా గ్రామాలలో హెల్త్ సంఘాల ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు నాయకులు, దళిత సంఘాల యువకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మంగలపాడ్ మాజీ ఉప సర్పంచ్ కుంట శ్రీనివాస్, హరిదాస్, కాంగ్రెస్ నాయకులు, దళిత సంఘాలనాయకులు, యువకులు, పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

మద్నూర్ : బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ప్రత్యేకంగా కృషి చేసిన బాబు జగ్జీవన్ రామ్ ఆయన స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధరాస్ సాయిలు అన్నారు. మద్నూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను గ్రామ కార్యదర్శి సందీప్ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్ రామ్ బడుగు బలహీన వర్గాలభ్యున్నతికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యాక్రమంలో నాయకులు హనుమాన్లు, సలాబత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయ చైర్మన్ రామ్ పటేల్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు హనుమంతు యాదవ్, పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు కరగ్ గ్రామపంచాయతీ చిన్న తడుగూరు గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవరావు పార్టీలు మాట్లాడుతూ.. బాబు జగ్జీవన్ రామ్ అందించిన సేవ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ముందుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో కారోబార్ శివాజీ, బిజెపి నాయకులు, కార్మికులు, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోతంగల్ : మండలంలోని సోంపూర్ గ్రామంలో ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో భారత మాజీ ఉప ప్రధాని, ప్రజానాయకులు హరిత విప్లవ సాధకుడు డా.బాబు జగ్జీవన్ రామ్ జయంతి పురస్కరించుకొని, చిత్రపట్టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యమంలో సోంపూర్ ఎంఆర్‌పిఎస్ యువ నాయకులు కే.సాయినాథ్, గ్రామ అధ్యక్షులు ఎమ్.మరిభ, నాగయ్య, సంగారం, సాయిలు, నాగేష్, తదితరులు పాల్గొన్నారు.

తాడ్వాయి : మండల పరిషత్ కార్యాలయంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సామాజిక మానవత్వం కులరహిత సమాజం కోసం పోరాడిన యోధుడు భారత మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ అని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలయ్య, స్వామి, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సాలూర ప్రభుత్వ ఆసుపత్రిలో...

ఎడపల్లి : బడుగు బలహీన వర్గాల ఆశజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సాలూర మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రాజ్‌కుమార్ అన్నారు. బాబు జగ్జీవన్ రామ్ జయంతి పురస్కరించుకొని ఆస్పత్రిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులులర్పించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ.. యువత, విద్యావంతులు బాబు జగ్జీవన్ రావును ఆదర్శంగా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఇందిర, స్టాఫ్‌నర్స్ రోజా, ఫార్మసిస్ట్ రమణ కుమార్, ఆస్పత్రి ఏఎన్ఎంలు, రామారావు (హున్సా), తదితరులు పాల్గొన్నారు.


దోమకొండలో..

రామారెడ్డి : మండలంలోని మద్దికుంట, రెడ్డిపెట్, ఆయా గ్రామాల్లో బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కేంద్ర మంత్రిగా దేశానికి అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శిలు ఎం.నరేష్, బి.నరేష్, వీడీసీ నారాయణ, ఫీల్డ్ అసిస్టెంట్ చిన్నస్వామి, వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఎడపల్లి : నేటి యువతకు బాబు జగ్జీవన్ రామ్ ఆదర్శప్రాయుడని అంబేద్కర్ యువజన సంఘం నాయకులు అన్నారు. మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు మేతరి గంగాధర్, (ఎమ్మార్పీఎస్) జిల్లా అధ్యక్షుడు డల్లా సురేష్ మాదిగ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు జోగ్గారి నరేందర్, సంఘం పెద్దలు, కర్రోల గంగారం, మస్కూరి గంగాధర్, తోకలి అబ్బులు, అంబేద్కర్ యువజన సంఘం సభ్యులు, ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.


రామారెడ్డిలో..

లింగంపేట్ : మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా కాంగ్రెస్ నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుర్ర నారాగౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డాక్టర్ రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాద్‌గౌడ్, మండల మైనార్టీ సెల్ అధ్యక్షుడు అఫ్రోజ్ ఉపాధ్యక్షులు సలీం కాంగ్రెస్ నాయకులు అశోక్. తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డి (లింగంపేట్): మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆదేశానుసారం మండల కేంద్రలో సీనియర్ కాంగ్రెస్ మండల నాయకులు, గ్రామ నాయకులు, పట్టణ నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కురుమ సాయిబాబా, మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, మాజీ జెడ్పీటిసి ఉషాగౌడ్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ : మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అనంతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి, నాయకులు సీతారాం మధు, నల్లపు శ్రీనివాస్, పోగుల నర్సింలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు పోగుల సాయిలు, గోపాల్‌రెడ్డి, అంబేద్కర్ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్ : బాబు జగ్జీవన్‌రామ్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పెరిక శ్రీనివాస్ కొనియాడారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుంగా బాబు జగ్జీవన్ రావ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయంలో నందు పటేల్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రావ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంగెం గ్రామంలో మాజీ ఎంపీపీ పాల్త్య విఠల్, ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రావు చిత్రపటానికి పూలమాలేసి నివాళులరచారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ ఫోరం కన్వినర్ కంది మల్లేష్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల అధ్యక్షుడు నందు పటేల్ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల కోసం అలుపెరుగని కృషి చేసిన సంఘ సంస్కర్త అని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సాయిలు, లింగం, యూసుఫ్, సాయగౌడ్, శాంతయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

బాబు జగ్జీవన్ రామ్ రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి: ఎమ్మెల్యే..

పిట్లం : బాబు జగ్జీవన్ రామ్ రాజకీయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ కమిటీ ఆవరణలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగ్జీవన్ రామ్ మంచి విద్యావేత్తగా, మచ్చలేని నిస్వార్థ నాయకునిగా సాఫీగా ముందుకు సాగారని కొనియాడారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు తదితరులు పాల్గొన్నారు.


ఎల్లారెడ్డి (లింగంపేట్)లో


పోతంగల్‌లో..


పిట్లంలో..

ఆకతాయిలకు అడ్డాగా.. అంగన్వాడీ సెంటర్

- పట్టించుకోని అధికారులు

నవతెలంగాణ-జుక్కల్



అంగన్వాడి కేంద్రంలోని మందు బాటిల్‌లను పారేసిన ఆకతాయిలు

మండలంలోని ఖేమ్రాజ్ కల్లాలి గ్రామంలో అంగన్వాడీ రెండవ సెంటర్‌లో మందు బాబులకు, ఆకతాయిలా అడ్డాగా కేంద్రం మారింది. గ్రామానికి కొంత దూరంలో రెండవ అంగన్వాడీ సెంటర్ ఉంది. ఈ సెంటర్‌లో సాయంత్రం, అర్ధరాత్రుల సమయం వరకు మందుబాబులు మందును తెచ్చుకొని అడ్డగా ఏర్పాటు చేసుకున్నారు. నిత్యం ఈ తంతు జరుగుతున్న గ్రామస్తులు, అధికారులు ఎవరు పట్టించుకోకపోవడంతో కేంద్రంలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న టీచర్‌కు సవాల్‌గా మారింది. అంగన్వాడీ కేంద్రంను అడ్డాగా మార్చుకొని, రాత్రిపూట అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని, కొంతమంది గ్రామస్తులు చూసినవారు తెలిపారు.

ఇట్టి విషయంపై అంగన్వాడీ టీచర్‌కు వివరణ కోరగా..

నిత్యం ఇదే తంతు జరుగుతోందని తలనొప్పిగా మారుతుందని, పాఠశాలకు వచ్చే చిన్నపిల్లలకు ఆకతాయిలు పగలగొట్టిన మందు సీసా గాజు బుగలు పిల్లల కాళ్లకు గుచ్చుకుపోవడం పలుమార్లు జరిగాయని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు, తమకు సమస్యలు తలెత్తుతున్నాయని, అందువలన ఉదయం తొందరగా వచ్చి వాటిని తొలగిస్తున్నామని పేర్కొన్నారు. ఇట్టి విషయమై అధికారులు స్పందించి ఆకతాయిలను గుర్తించి.. వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కేంద్ర నిర్వాహకురాలు గంగామణి తెలిపారు.

ఎమ్మెల్యే వచ్చినా.. సమాచారం ఇవ్వరా..?

- మా కార్యక్రమం కాదని అధికారుల సమాధానం
- పర్యటనపై గోప్యంగా ఉంచడంపై ఆంతర్యమేంటి?

నవతెలంగాణ-రామారెడ్డి

ఓట్లు వేసి గెలిపించుకున్న తమ ఎమ్మెల్యే తమ ప్రాంతానికి వచ్చి వెళ్లిన విషయం తెలవకపోవడంతో.. ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యేకు తెలియజేయడానికి కనీస సమాచారాన్ని అధికారులు ఇవ్వకపోవడంపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మీడియాకు కూడా సమాచారం ఇవ్వకపోవడంపై ఆంతర్యం ఏంటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కామారెడ్డి ఎమ్మెల్యే రమణారెడ్డి శుక్రవారం మండలంలోని అన్నారం రైతు వేదికలో 18 మంది లబ్దిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసిన విషయం విధితమే. ఎమ్మెల్యే వస్తున్నట్లు అధికారులు ఎలాంటి సమాచారాన్ని మీడియాకు తెలవకుండా జాగ్రత్తపడ్డారు. గతంలో 4 నుండి 5 పర్యాయాలు అదే రైతు వేదికలో కల్యాణ లక్ష్మి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసినా.. అధికారులు మీడియాకు సమాచారం ఇవ్వలేదు.

అధికారులను వివరణ కోరగా..

ఎమ్మార్వో ఉమాలత మా కార్యక్రమం కాదు, నూతనంగా బాధ్యతలు స్వీకరించినందున, మర్యాదపూర్వకంగా కలవడానికి వెళ్లానని సమాధానం ఇచ్చారు. ఎంపీడీవో తిరుపతిరెడ్డిని వివరణ కోరగా, చెక్కులన్నీ క్యాంప్ ఆఫీస్ నుంచి వచ్చాయని, ఎమ్మెల్యే వస్తుందని వెళ్లామని సమాధానమిచ్చారు. ఎమ్మెల్యే మండల పర్యటనకు ప్రత్యేక అధికారులను ప్రభుత్వం ఏమైనా నియమించిందా అనే ప్రశ్న ఉత్పన్నమవుతుంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల పర్యటనలకే సమాచారమిచ్చి ప్రచారం చేస్తారా..? ప్రతిపక్ష ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వరా.. అని ప్రతిపక్ష పార్టీ నాయకులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజల కోసం ప్రజల చేత ఎన్నుకున్న ప్రజాప్రతినిధుల పర్యటన సమాచారాన్ని సంబంధిత అధికారులు ప్రజలకు, మీడియాకు తెలిపే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగొద్దు

- ఎమ్మెల్యే ప్రొద్దుటూరు సదర్శన్‌రెడ్డి
- ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

నవతెలంగాణ-రెంజల్

రైతులకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా మౌలిక సదుపాయాలను కల్పించాలని నిర్వాహకులకు ఎమ్మెల్యే ప్రొద్దుటూరు సదర్శన్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని నీల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ నిబంధన మేరకు ధాన్యం ఎండబెట్టి కొనుగోలు కేంద్రంలో విక్రయించాలన్నారు. లారీల కొరత లేకుండా రైతుల వద్ద ఉన్న ట్రాక్టర్లతో తమ ధాన్యాన్ని సమీపంలో రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. గన్ని బస్తాల కొరత లేకుండా జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమకూర్చనున్నట్టు పేర్కొన్నారు. రైతులు సమయపాలన పాటిస్తు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తాహెర్‌బిన్ అందాన్, అంతి రెడ్డి రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మొబీన్ ఖాన్, జి.సాయిరెడ్డి, జావీద్ ఉద్దీన్, గియాసోద్దీన్, గంగా కృష్ణ, గోసుల గంగా కిషన్, ధనుంజయ్, సాయిబాబా గౌడ్, ఆబిద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలి

- సీఐ చంద్రశేఖర్‌రెడ్డి


అవగాహన కల్పిస్తున్న సీఐ

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలోని కమ్మరిగల్లీ, బట్టుగల్లీ, కాకర్లగల్లీ, కుంబాల గల్లీ వార్డు ప్రజలకు పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నేటి సమాజంలో జరుగుతున్న సైబర్ క్రైమ్ మోసాలపై ప్రతి ఒక్కరూ అవగాహన ఉండాలని శనివారం తెలిపారు. ఫోన్‌లకు వచ్చిన లింకులను ఓపెన్ చేసి ప్రమాదంలో చిక్కుకొని, బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేసుకోవద్దని తెలిపారు. ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌ల వల్ల యువత అప్పులపాలై ఆర్థిక సమస్యలతో ఇబ్బందులు పడుతూ ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గెరిగంటి లక్ష్మీనారాయణ, వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నవతెలంగాణ-మాచారెడ్డి (కామారెడ్డి)

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలిపాయని వ్యక్తి మృతి చెందినట్టు మాచారెడ్డి ఎస్సై అనిల్ కుమార్ శుక్రవారం తెలిపారు. మండల పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి వయస్సు (55 నుంచి 60) గల వ్యక్తి భవానిపేట్ గ్రామ శివారులో గల సర్వీస్ రోడ్ 11పై నడుచుకుంటూ వెళుతున్నాడు. గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో కాలుకు, తలకు బలమైన గాయాలై ఉండడంతో 108 అంబులెన్స్‌లో చికిత్స కొరకు శుక్రవారం ఉదయం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం మృతి చెందినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ వ్యక్తికి ఛాతి భాగంలో శ్రీకృష్ణుని పచ్చబొట్టు ఉంది. కుడి చేతి వైపున శ్రీ ఆంజనేయ స్వామి పచ్చబొట్టు, శివుడి బొమ్మ కలదు. ఈ విషయంలో భవానిపెట్ మాజీ సర్పంచ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. ఎవరికైనా మరణించిన వ్యక్తి గురించి ఆచూకీ తెలిస్తే మాచారెడ్డి ఎస్ఐ 8712686151, కామారెడ్డి రూరల్ సీఐ 8712686148 నెంబర్లకు సమాచారం ఇవ్వగలరు.

తాడ్‌బిలోలి రామాలయ నూతన కమిటీ ఎన్నిక

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని తాడ్‌బిలోలి రామాలయ నూతన కమిటీని ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో ఏకగ్రీవంగా శనివారం ఎన్నుకున్నారు. రామాలయ కమిటీ చైర్మన్‌గా గోసుల శ్రీనివాస్, కార్యదర్శిగా బి.గంగాధర్, డైరెక్టర్లుగా గైని నరేష్, చాకలి అబ్బయ్య, సాయమ్మలను దేవాదాయ శాఖ అధికారి కమల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు.

మంచి కార్యకర్తను కోల్పోయాం

- మండల అధ్యక్షులు ధారాస్ సాయిలు

నవతెలంగాణ-మద్నూర్

మండలంలోని రూసేగావ్ గ్రామానికి చెందిన రామ్ రావు డోంగ్లికర్ మృతి పట్ల మంచి కార్యకర్తను కాంగ్రెస్ పార్టీ కోల్పోయిందని మండల పార్టీ అధ్యక్షులు ధరాస్ సాయిలు శనివారం తెలిపారు. ఇటీవల రూసేగావ్ గ్రామానికి చెందిన రామ్ రావు డోంగ్లికర్ ప్రమాదంలో మృతి చెందడంతో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామ తాజా మాజీ సర్పంచ్ గోవింద్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమాన్లు స్వామి, సింగిల్ విండో చైర్మన్ శ్రీనివాస్ పటేల్, సలాబత్పూర్ ఆంజనేయస్వామి ఆలయ చైర్మన్, మాజీ ఎంపీపీ ప్రజ్ఞా కుమార్ కొండ గంగాధర్, మండల యూత్ అధ్యక్షులు అనుమంతు యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

తండ్రి కొడుకుల కృషి.. ప్రజలకు ఎంతో మేలు..


తపాల కార్యాలయంలో ప్రారంభించిన ఆధార్ సెంటర్

నవతెలంగాణ-మద్నూర్

మండల కేంద్రానికి చెందిన బిజెపి పార్టీ నాయకులు తమ్మేవారు స్వర్గీయ రమేష్‌సేట్ ఫలితంగా మండల కేంద్రంలో నూతనంగా తపాల కార్యాలయ సొంత భవనం నిర్మించారు. అయ్య కృషి ఫలితంగా తపాల కార్యాలయ భవనం నిర్మించగగా.. కొడుకు అజయ్ తమ్మేవార్ ఇటీవల ఢిల్లీకి వెళ్లి కేంద్రం మంత్రిని కలిసి బిచ్కుంద, జుక్కల్ మండల కేంద్రాల్లో తపాల కార్యాలయాల సొంతభవనాల నిర్మాణం కోసం.. మండల కేంద్రంలోని తపాల కార్యాలయంలో ఆధార్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని విన్నవించారు. కేంద్రమంత్రి ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని తపాల కార్యాలయంలో శనివారం ఆధార్ సెంటర్‌ను ప్రారంభించారు. ఆధార్ సెంటర్ ప్రారంభం కావడం మండల, గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. తండ్రి కొడుకుల కృషి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని అభినందిస్తున్నారు.

శబరిమాత ఆశ్రమంలో 25వ రజతోత్సవ వార్షికోత్సవాలు

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమంలో 25వ రజతోత్సవ వార్షికోత్సవాలు శనివారం భక్తులు వైభవంగా నిర్వహించారు. ఉదయం మాతాజీ అభిషేకం, జ్యోతి ప్రజ్వలనంతో ఉత్సవాలు గోపూజ ధ్వజారోహణ, రుద్ర చండి, అర్చన, అగ్ని ప్రతిష్ట, రుద్ర సహిత నవ చండీ హెూమం చేపట్టారు. అనంతరం మహాత్ముల సందేశాలు వినిపించారు. దీపోత్సవా కార్యక్రమాలు నిర్వహించారు. రకరకాల పూలతో విద్యుత్ బల్బులతో అలంకరించిన రథాన్ని భక్తి పాటలతో ఆలయం నుంచి పాత బస్టాండ్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. శబరీశ్వర భజన మండలి బీదర్, ఎండ్రి యాల్, హైదరాబాద్ కరీంనగర్, అదిలాబాద్, బృందాల సంగీత విభావరి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో ఎల్లారెడ్డి డి.ఎస్.పి శ్రీనివాసరావు, స్థానిక ఎస్సై వెంకటేశ్వర్లు, పర్యవేక్షించారు. బీదర్, అదిలాబాద్, హైదరాబాద్, కరీంనగర్, తదితర రాష్ట్రాల భక్తులు హాజరయ్యారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-మాక్లూర్

ఆలూర్ మండలంలోని గుత్ప, కల్లెడ గ్రామాల్లో మాక్లూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను పీఏసీఎస్ చైర్మన్ బుర్రోల్ల అశోక్ ఆధ్వర్యంలో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తమ ధాన్యం అమ్ముకోవాలని తెలిపారు. ప్రభుత్వం బోనస్ కూడా ఇస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం ఉపాధ్యాకులు శేఖర్, సంఘం డైరెక్టర్స్ రమేష్, పులిమంటి గంగారం, అజ్జు నాయక్, సంఘం సెక్రెటరీ బి.ప్రవీణ్, సిబ్బంది, గ్రామ రైతులు పాల్గొన్నారు.

నూతన రేషన్ కార్డుల సర్వే ప్రారంభం



సర్వే చేస్తున్న అధికారులు

నవతెలంగాణ-మెండోరా

మెండోరా మండల కేంద్రంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నూతన రేషన్ కార్డుల సర్వేను ప్రారంభించారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ మీ సేవ, ఆన్లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న కొత్త రేషన్ కార్డులు, పేర్ల నమోదు కోసం దరఖాస్తు చేసుకున్న జాబితా ప్రకారం వివరాలు సేకరించి జాబితాలో వచ్చిన పేర్లల్లో అర్హులను, అనర్హులను గుర్తిస్తున్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్‌చారి, జూనియర్ అసిస్టెంట్లు లక్ష్మణ్ నాగరాజు తదితరులున్నారు.

సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శ నేత బాబు జగ్జీవన్‌రాం

బాబు జగ్జీవన్‌రాం భారత దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావడానికి కీలక పాత్ర పోషించిన వ్యక్తి అని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన ఎల్లప్పుడూ అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాడేవారని వివరించారు. ఆయన చేసిన సేవలు, సంస్కరణలను అందరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. శనివారం మాజీ ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతిని జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

- ఘనంగా జయంతి వేడుకలు
- నివాళులర్పించిన పలువురు



కంఠేశ్వర్ : జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..



నిజామాబాద్‌సిటీ : సీపీఐ ఆధ్వర్యంలో..

నవతెలంగాణ-విలేకరుల బృందం

కాంగ్రెస్ ఆధ్వర్యంలో..

కంఠేశ్వర్ : కాంగ్రెస్ భవన్‌లో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహేర్‌బిన్ హందాన్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో..

జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షుడు మల్లమాది సుధాకర్ ఆధ్వర్యంలో ఓల్డ్ అంబేద్కర్ భవన్ వద్ద బాబు జగ్జీవన్ రాం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ సభ్యుడు సలేంద్ర బాబురావు, నగరాధ్యక్షురాలు సమాధాన, ఉపాధ్యక్షురాలు అనిత, యువసేన అధ్యక్షుడు చిరు, కార్యకర్తలు నాగరాజు, శ్రీకాంత్, థామస్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీవోస్ ఆధ్వర్యంలో..

డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ 118వ జయంతిని పురస్కరించుకొని నగరంలో గల బాబు జగ్జీవన్‌రాం చౌరస్తా వద్ద టిఎన్జీవోస్ పక్షాన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించి స్మరించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాత అంబేద్కర్ భవన్‌లో ఏర్పాటు చేసిన అధికారిక కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్ మాట్లాడుతూ.. ఉద్యోగులకు జిల్లా ప్రజలందరికీ మహనీయ డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆ మహానుభావుని ఆశయ సాధనకు ఉద్యోగులు, ప్రజలందరూ నడుచుకోవాలని, సమాజహితం కోసం ప్రజలందరూ ఐక్యంగా ఉండి కుల, మత, రహిత సమాజం కోసం పాటుపడుతూ నవ సమసమాజ స్థాపన కోసం కృషి చేద్దామని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, టిఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షులు గైని గంగారం, రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా సహాధ్యక్షులు చిట్టి నారాయణరెడ్డి, అర్బన్ అధ్యక్షులు జాకీర్ హుస్సేన్, టీఎన్జీవో సలహాదారులు వనమాల సుధాకర్ తదితరులు హాజరై నివాళులర్పించారు.

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా నిజామబాద్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో గల సమావేశపు హాల్లో బాబు జగ్జీవన్ రావ్ చిత్రపటానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లెపూల జగన్ మోహన్ గౌడ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఐఎన్టీయూసీ..

ఐఎన్టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

బీసీ ఉపాధ్యాయ సంఘం..

రైల్వే కమాన్ వద్ద జగ్జీవన్‌రాం విగ్రహానికి బిసి ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బిసిటియు జిల్లా అధ్యక్షులు మాడవేడి వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో..

నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య ఆదేశాల మేరకు నిజామాబాద్ కమిషనరేట్ కార్యాలయంలో నిజామాబాద్ అదనపు పోలీస్ కమీషనర్ (ఎ.ఆర్) ఎ.రామచంద్రరావు బాబు జగ్జీవన్‌రామ్ 117వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డి.సి.పి (ఎ.ఆర్) మాట్లాడుతూ.. 1908 ఏప్రిల్ 5న బీహార్ రాష్ట్రంలోని షాబాద్ జిల్లా జిల్లా చంద్వా గ్రామంలో జన్మించారని.. అతడు ముట్టుకున్న కుండలో నీటిని తాగడానికి ఆధిపత్య కులాల విద్యార్థులు నిరాకరించడంతో మొదటిసారి అంటరానితనానికి గురయ్యాడని తెలిపారు. సామాజిక, రాజకీయ, బానిసత్వంపై జీవితాంతం, యుద్ధం చేసిన వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్ అన్నారు. స్వరాజ్య ఉద్యమంతో పాటు దేశ పునర్నిర్మాణంతో ముడిపడిన ఆయన జీవితం రాజకీయ, సామాజిక, చారిత్రక ప్రాధాన్యత కలిగినది అన్నారు. ఈ కార్యాక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీశైలం, సి.సి.ఆర్.బి ఇన్‌స్పెక్టర్ సతీష్, రిజర్వు ఇన్‌స్పెక్టర్స్ తిరుపతి (అడ్మిన్), శ్రీనివాస్ (వెల్ఫేర్), శేఖర్ బాబు, ఆఫీస్ సూపరింటెండెంట్‌లు శంకర్, బషీర్, సి.సి.ఆర్.బి సిబ్బంది, ఐ.టి కోర్ సిబ్బంది, పోలీస్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, సెంట్రల్ కాంప్లెంటు సెల్ సిబ్బంది, స్పెషల్ పార్టీ సిబ్బంది హెూమ్ గార్డ్సు సిబ్బంది పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శ నేత బాబు జగ్జీవన్ రాం అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. దేశ మాజీ ఉప ప్రధాని 'బాబూ' జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా మహనీయునికి ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ఘనమైన నివాళి అర్పించారు. వేల్పూర్ మండల కేంద్రంలో నిర్వహించిన బాబు జగ్జీవన్ రాం జయంతి వేడుకల కార్యక్రమంలో పాల్గొని అయన విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ కులరహిత సమాజం కోసం పాటుపడిన బడుగు, బలహీన వర్గాల నేత బాబు జగ్జీవన్ రాం అన్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం, సామాజిక సమానత్వం కోసం పోరాడిన ఆదర్శ నేత అని కొనియాడారు. అంబేద్కర్ బడుగు బలహీన వర్గాల కోసం రాజ్యాంగం రచిస్తే, ఆ రాజ్యాంగ ఫలాలు అందటానికి అవి అమలయ్యే విధంగా కృషిచేసిన వ్యక్తి బాబు జగ్జీవన్ రామ్ అని అన్నారు. తన జీవిత కాలం మొత్తం అణగారిన వర్గాల కోసం కృషి చేశారని వివరించారు. ఆయన ఆశయాల సాధన కోసం అన్ని వర్గాలు ఏకమై పాటుపడాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ ఆధ్వర్యంలో నిర్వహించిన డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకల్లో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాల ఐడీసీఎంస్ చైర్మన్ బాదావత్ తారాచంద్ నాయక్ పాల్గొన్నారు. జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నరసయ్య, పంచాయతీ కార్యదర్శి గంగాజమున, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సుంకేట రవి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బుచ్చన్న, కాంగ్రెస్ పార్టీ టౌన్ ప్రెసిడెంట్ నిమ్మ రాజేంద్ర ప్రసాద్, మండల కోశాధికారి నూకల బుచ్చి మల్లయ్య, మండల పార్టీ జనరల్ సెక్రెటరీ సుంకేట శ్రీనివాస్, మండల పార్టీ యూత్ వైస్ ప్రెసిడెంట్ కౌడ శైలేందర్, పూజారి శేఖర్, వాల్గోట్ రంజిత్, సింగిరెడ్డి శేఖర్, గణేష్, హజార్, దూలూరు కిషన్ గౌడ్, జగదీష్, సల్లూరు గణేష్, నాయకులు, కార్యకర్తలు, పంచాయతి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మోపాల్ : బోర్గాం.పి చౌరస్తాలో బాబు జగ్జీవన్‌రాం జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేశారు. అనంతరం ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు గంధమల నాగభూషణం మాదిగ మాట్లాడుతూ.. అణగారిన వర్గాల సామాజిక సమానత్వం కోసం మన వంతు కృషి చేశారని అంటరానితనం నిర్మూలనకై తన చిన్న వయసులోనే అణగారిన వర్గాల కోసం పోరాడిన వ్యక్తి అని తెలిపారు. స్వతంత్ర ఉద్యమంలో కీలక భూమిక పోషించడంతోపాటు రాజకీయ రంగంలో ఉన్నత పదవులను అధిరోహించి ఆ పదవులకు వన్నెతెచ్చిన వ్యక్తి బాబు జగ్జీవన్‌రాం అని పేర్కొన్నారు. చిన్న వయసులోనే శాసనసభ్యుడిగా, పార్లమెంటు సభ్యుడిగా అనేక కేంద్ర మంత్రి పదవులను నిర్వర్తించి భారతదేశ అభివృద్ధిలో తనవంతు కృషి చేశారని ఆయనకు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళిత సమాజం ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఉద్యమాలలో రాజకీయ రంగంలో ముందుకు సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకువెళ్లడం కోసం మన వంతు పాత్ర పోషించాలని దళిత పీడిత వర్గాల ప్రజలందరికీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షులు యాదగిరి మాదిగ, బీసీ నాయకులు, కుర్మ సంఘం జిల్లా అధ్యక్షులు బీజేవైఎం మాజీ జిల్లా అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, ఎమ్మార్పీఎస్ యువ అధ్యక్షులు మనోహర్ మాదిగ, శంకర్ మాదిగ, మల్లేష్ మాదిగ, రాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధర్యంలో..

నిజామాబాద్ సిటీ : భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో జగ్జీవన్ రాం జయంతి సందర్భంగా రైల్వే కమాన్ వద్ద గల బాబు జగ్జీవన్ రావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్, సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య, సిపిఐ జిల్లా నాయకులు పి.రంజిత్, బి.రఘురాం, పి.హనుమాన్లు, అంజలి పాల్గొన్నారు.

టీడిపి ఆధ్వర్యంలో..

తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ అర్బన్ మాజీ అధ్యక్షులు అంబిక సత్యనారాయణ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఓల్డ్ అంబేద్కర్ భవన్ చౌరస్తాలోని జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో వినోద్ కుమార్, ఎల్లంకి పురుషోత్తం, లవంగ రాజు, గంగుని రాజేశ్వర్, స్వామి, తదితరులు పాల్గొన్నారు.

భీంగల్ రూరల్ : పట్టణంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలు ప్రభుత్వ కార్యాలయాల్లో, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా జగ్జీవన్ రామ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘాల అధ్యక్షులు గడల ప్రసాద్, రాజేందర్, రవీందర్, శ్రీను, భగేష్, గణేష్, అనంతరావు, నరసయ్య, చౌదరి, సంతోష్, దశరథ్, సుమన్, నవీన్, రవి, అనిల్, రత్నం, విక్రమ్, శర్మ నాయక్, మహిళా నాయకులు కల్పన, నాగేంద్ర, రవి తదితరులు పాల్గొన్నారు.

ధర్పల్లి : మండల కేంద్రంలో ఎమ్ఆర్‌పిఎస్ మండల ఇంచార్జి నక్క రాజేందర్ మాదిగ ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ నక్క రాజేందర్ మాదిగ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిరికొండ మండలాధ్యక్షులు మొట్టల దీపక్ మాదిగ, ధర్పల్లి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు గుంటి రాజా నరసయ్య, పస్కె నరసయ్య, పస్కె నాని, ఒడ్డెటి గంగారాం, గుంటి అజయ్, పూసిన సందీప్, శనిగరం జలంధర్, కొండూరు ముత్తెన్న, పూసిన నడిపి బాబన్న తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలో

మాక్లూర్ : మండలంలోని మామిడిపల్లి గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతిని షెడ్యూల్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం మామిడిపల్లి బ్రాంచ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు తెడ్డు శేఖర్, కార్యదర్శి డీసీ గంగాధర్, గౌరవ అధ్యక్షులు బండారి రాములు, దయ్యాల కరెన, కోశాధికారి భూపతి ఎర్రన్న, నాయకులు పెండ అనిల్, పెండస్వామి, కూనా రాజేశ్వర్, భూపతి వినోద్ కుమార్, తలారి బుర్రన్న తదితరులు పాల్గొన్నారు.

మెండోర : దళిత సంఘాల ఆధ్వర్యంలో సోన్‌పేట్ గ్రామంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దళిత నాయకులు బాబుజగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బురుకల కమలాకర్, దళిత సంఘాల నేతలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

మచ్చర్ల గ్రామంలో..

ఆర్మూర్ : మండలంలోని మచ్చర్ల గ్రామ మాదిగ సంఘం అధర్యంలో బాబు జగ్జీవన్ రామ్ 118వ జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద మనుషులు అన్నారం నడ్పిగంగారాం, ఉంగ్లార్ల భూమన్న తదితరులు పాల్గొన్నారు.

దళిత ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో..

ఆర్మూర్ దళిత ఐక్య సంఘటన ఆధ్వర్యంలో జగ్జీవన్ రామ్‌కు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు జంగం అశోక్, గుమ్మడి చంద్రయ్య, కోటేశ్వర్, పింజ భూమేశ్వర్, యల్‌టీ కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని పలు గ్రామాలలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాదిగ సంఘం నాయకులు అరుంధతి తదితరులు పాల్గొన్నారు.



జక్రాన్‌పల్లిలో..



ధర్పల్లిలో..

హామీలన్నింటినీ అమలు చేస్తున్నాం

- బీఆర్ఎస్ అభివృద్ధిని అడ్డుకుంటోంది
- అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు
- ప్రజల్లో చిచ్చుపెట్టడం బీజేపీకే సాధ్యం
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-డిచ్‌పల్లి

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీ మేరకు అన్నింటిని ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, బిఆర్ఎస్ నాయకులు రాష్ట్రం అభివృద్ధికి కాకుండా అడుగడుగునా అడ్డుపడుతున్నారని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి అన్నారు. ఇక ప్రజల మధ్య చిచ్చుపెట్టడం బీజేపీకే సాధ్యమని విమర్శించారు. శనివారం మండలంలోని అయా గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన ప్రారంభోత్సవాలు చేశారు. మండలంలోని కోరట్‌పల్లి, యానంపల్లితో పాటు పలుచోట్ల ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి మాట్లాడారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక అనేక అభివృద్ధి పనులు చేశామని అందులో భాగంగా మండలంలో సుమారుగా రూ.12.50 కోట్ల నిధులతో అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కోరట్‌పల్లి తండా, కోరట్‌పల్లి, సద్దులం, యానంపల్లి, సాంపల్లి, సుద్దపల్లి గ్రామాల్లో సిసి, బిటి రోడ్లు, పంచాయతీ భవనాలు, కల్వర్టులు, సహకార సొసైటీ గోదాం తదితర వాటికి నిధులను మంజూరు చేసినట్లు వివరించారు. గ్రామంలో అర్హులైన వారికి ఇందిరమ్మ ఇండ్లు కేటాయిస్తామని, గ్రామంలో ఇళ్లు లేని వారు ఎవరు ఉండవద్దని అన్నారు. రాష్ట్రాన్ని కెసిఆర్ 8లక్షల కోట్ల అప్పుల పాలు చేశాడని, ఆ అప్పులకు వడ్డీలు కట్టేందుకే రాష్ట్ర ఆదాయంలో చాలా భాగం ఖర్చు అవుతుందని అందువల్లే కొన్ని పథకాల అమలులో ఆలస్యం జరుగుతుందని పేర్కొన్నారు. మహిళలకు ఆర్టీసి బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే సౌకర్యాలు కల్పించామని, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని, రైతులు పండించిన పంటకు మద్దతు ధర, సన్న వడ్లకు బోనస్ ఇస్తున్నామని, గృహాలకు 200 యూనిట్ల విద్యుత్ వంటి పథకాలు విజయవంతంగా అమలు చేస్తున్నామని అన్నారు. నిరుద్యోగులను ఉద్యోగాలు కల్పించామని, రాజీవ్ యువ వికాసం ద్వారా సబ్సిడీపై రుణాలను అందజేస్తున్నామని, మహిళలకు కోటీశ్వరులు చేయడానికి బస్సులు, పెట్రోల్ బంకులు, కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లులు తదితర వాటికి ఎలాంటి వడ్డీ లేకుండా రుణాలు అందజేస్తున్నామన్నారు.

బిజెపి, బిఆర్ఎస్ నాయకులు రాష్ట్రం అభివృద్ధికి కాకుండా అడుగడుగునా అడ్డుపడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను బిజెపి అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలో అమలు చేస్తున్నారా అని ప్రశ్నించారు. బీజేపీ అసత్య ప్రచారాలు చేస్తుందని, సన్న బియ్యం పథకం దేశ చరిత్రలోనే చారిత్రాత్మకంగా నిలిచిపోతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు బిసి కులగణన చేశామని, దేశంలో ఎక్కడ లేని విధంగా బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నామని, ఎస్సీ వర్గీకరణ చేశామని అన్నారు. ఎంపిగా గెలిచిన ఒక గ్రామానికి నయా పైసా మంజూరు చేయలేదని, కేంద్రం రాష్ట్రానికి డబ్బులు ఇవ్వకున్న ఇక్కడ ఉన్న బిజెపి నాయకులకు అడిగే దమ్ము ధైర్యం లేదని, గుజరాత్ వారి వద్ద గులాంగిరి చేస్తున్నారని విమర్శించారు. త్వరలోనే రేషన్ కార్డులను అందజేస్తామని ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. గ్రామాలను అభివృద్ధి చేసే బాధ్యత తమ ప్రభుత్వానిదేనని, ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గడిచిన 15 నెలల కాలంలోనే వేలకోట్ల రూపాయలతో రూరల్‌లో అభివృద్ధి చేపడుతున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో పిసిసి డెలిగేట్ శేఖర్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు అమృతపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పోలసాని శ్రీనివాస్, సహకార సొసైటీ చైర్మన్లు రాంచందర్‌గౌడ్, చింత శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణ, మాజీ ఎంపీపీ కంచెట్టి గంగాధర్, నర్సయ్య, వైస్ చైర్మన్ కుమ్మరి గంగారం, డాక్టర్ జాహంర్, మహిపాల్ నాయక్, సేవలాల్, నరహరి, దాసరి రాము, డాక్టర్ షాదుల్లా, అంతిరెడ్డి మోహన్ రెడ్డి, సాయిరెడ్డి, లక్ష్మారెడ్డి, సిఈవో సాయిలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు తలెత్తితే చర్యలు తప్పవు

- ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నవీపేట్

వరి ధాన్యం కొనుగోలులో రైతులకు, నిర్వాహకులకు ఎవరైనా ఇబ్బందులు కలిగించేలా ప్రవర్తిస్తే చర్యలు తప్పవని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి హెచ్చరించారు. మండల కేంద్రంతో పాటు అభంగపట్నం, నాగేపూర్ గ్రామాలలో ఐకెపి ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వరి ధాన్యం కొనుగోలులో ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. లారీ డ్రైవర్లు, రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బందులు కలిగిస్తే బ్లాక్ లిస్టులో పెట్టడమే కాకుండా కేసులు నమోదు చేయాలని పోలీస్ శాఖ అధికారులను ఆదేశించారు. వ్యవస్థ మార్పునకు కఠిన చర్యలు తప్పవని అన్నారు. అనంతరం నాగేపూర్ శ్రీరామ ఆలయాన్ని సందర్శించారు. రైతులు 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని ధాన్యం కొనుగోలుకు తరలించి మద్దతు ధరతో పాటు బోనస్‌ను పొందాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఓ సాయగౌడ్, మార్కెటింగ్ డిపిఎం సాయిలు, తహసిల్దార్ వెంకటరమణ, ఏపీఎం భూమేశ్వర్ గౌడ్, మహిళా సంఘ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సుదర్శన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

- బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి

నవతెలంగాణ-మోర్తాడ్

నిజామాబాద్ జిల్లాలో సీనియర్ నాయకుడైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని బాల్కొండ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని ప్రజా నిలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంత్రివర్గ విస్తరణలో బోధన్‌కు చెందిన సుదర్శన్ రెడ్డికి అవకాశాన్ని ఇచ్చి జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని అన్నారు.

నిజామాబాద్ జిల్లా ఇంచార్జ్ ఉన్న జూపల్లి కృష్ణారావు ఆధ్వర్యంలో జిల్లా అభివృద్ధి జరుగుతున్నప్పటికీ సొంత జిల్లాలో మంత్రి పదవి ఉంటే మరింత అభివృద్ధి జరుగుతుందని అన్ని అర్హతలు ఉన్న సుదర్శన్ రెడ్డికి మంత్రి వర్గంలో చోటుకల్పించాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడైన సుదర్శన్‌రెడ్డికి మంత్రివర్గంలో అవకాశం ఇవ్వడం ద్వారా రాష్ట్ర ప్రయోజనాలలో తన పాత్ర పోషించడంతో పాటు జిల్లా అభివృద్ధికి అవకాశం దొరుకుతుందని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం సుదర్శన్ రెడ్డికి అవకాశం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలి

నవతెలంగాణ-మాక్లూర్

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ఏప్రిల్ 8న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద జరిగే ప్రజా ధర్నా పోస్టర్‌ను మండలంలోని కృష్ణనగర్‌లో సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శనివారం ఆవిష్కరించారు. అనంతరం నాయకులు జి.రమేష్, దేశెట్టి సాయిరెడ్డి మాట్లాడుతూ.. ఆపరేషన్ కగార్ పేరిట ఆదివాసి జాతి హననానికి బిజెపికి చెందిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎడతెగని విధంగా హత్యా కాండకు తెగబడుతున్నాయని అన్నారు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో వందలాది మందిని ఎన్‌కౌంటర్ల పేరిట హత్య గావిస్తున్నారని చెప్పారు. ఈ హత్యకాండను ప్రత్యేకించి ఆదివాసి జాతిని స్వదేశీ, విదేశీ కార్పొరేట్ కంపెనీల ప్రయోజనాల కోసం హతమారుస్తున్న విధానాన్ని దేశంలోని రాజకీయ పార్టీలు ప్రజా సంఘాలు, మేధావులు, ఆలోచనపరులు తీవ్రంగా వ్యతిరేకించి ఖండించాలని అన్నారు. కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షులు వేల్పూరు భూమయ్య, సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు సాయినాథ్, భారతి, నర్సయ్య, శివకుమార్, సత్యం, బన్ని, శ్రీనివాస్‌రెడ్డి, రాధ తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్‌గా మహమ్మద్ కాసిఫ్



నవతెలంగాణ-లింగంపేట్

జుక్కల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ఇన్చార్జిగా లింగంపేట గ్రామానికి చెందిన మహమ్మద్ కాసిఫ్‌ను శనివారం నియమించారు. నిజాంసాగర్ మండల కేంద్రంలోని విశ్రాంతి భవనంలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో యువజన కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నేత సుధా అమృత సాయిబాబా జిల్లా ఇన్‌ఛార్జిలుగా నియమితులయ్యారు. పట్టణానికి చెందిన రాష్ట్ర కాంగ్రెస్ మైనార్టీ సెల్ యూత్ నాయకుడు మహమ్మద్ కాశీఫ్‌ను జుక్కల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జిగా నియమించారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు నియమించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా మహమ్మద్ కాశీఫ్ మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించినందుకు ఎమ్మెల్యేలకు, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
5
ఆదివారం | ఏప్రిల్ 06, 2025 | www.navatelangana.com

మందారపు ఆకులపై సీతారాముల రూపం

నవతెలంగాణ-పిట్లం

మండలంలోని తిమ్మానగర్ గ్రామానికి చెందిన నల్లాల వినయ్ కుమార్, సరితాదేవి దంపతుల కూతురు సాయిస్మరణ విద్యతోపాటు ప్రకృతి అందాల బొమ్మల పెయింటింగ్‌పై మక్కువతో మందారపు ఆకులపై సీతారాముల ప్రతిమలను వేసి పలువురిని అబ్బురపరిచింది. కాగా ఇటీవల కాలంలో మందు గోలీలపై (టాబ్లెట్స్) ప్రకృతి అందాల బొమ్మలు వేసి పాఠశాల సిబ్బంది, పలువురి ప్రశంసించారు. సాయిస్మరణ మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతుంది. తీరిక సమయాలలో ప్రకృతి బొమ్మలు వేస్తూ పలువురి ప్రశంసలు అందుకుంటుంది.





ఎడపల్లి: ప్రతిజ్ఞ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



తాడ్వాయి: పాదయాత్రలో పాల్గొన్న మహిళలు



దోమకొండ: మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకలు

కాంగ్రెస్ హయాంలోనే సంక్షేమ ఫలాలు, అభివృద్ధి పనులు

- బోధన్ నియోజకవర్గం ఇంచార్జి యాదగిరి

నవతెలంగాణ-ఎడపల్లి/తాడ్వాయి/దోమకొండ/రెంజల్

కాంగ్రెస్ సహాయంలోనే సంక్షేమ ఫలాలు, అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని బోధన్ నియోజకవర్గం ఇంచార్జి, ఎస్టి సెల్ జిల్లా అధ్యక్షులు యాదగిరి అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ సోనియాగాంధీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో జై భీమ్ జై బాపు జై సంవిధాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జాతీయ నాయకుల చిత్రపటాల నుతోపాటు జాతీయ జెండాలను చేత పట్టుకొని ప్రధాన వీధులలో పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ ఫలాల గురించి ప్రజలకు నాయకులు వివరించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పులి శ్రీనివాసరావు, ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షులు ఈ రంటీ లింగం, బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు కరటూరి సత్యనారాయణ, బొబ్బిలి శ్రీనివాస్, మాజీ సర్పంచులు శంకర్ నాయుడు, ఎల్లయ్య యాదవ్, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం..

తాడ్వాయి : భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జూకంటి వెంకటరెడ్డి అన్నారు. జై బాపు, జై భీమ్, జై సంవిధాన్, కార్యక్రమం కరడపల్లి గ్రామంలో శనివారం నిర్వహించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ ప్రజలకు సమాన హక్కులు కల్పించిన భారత రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ జక్కుల రాజిరెడ్డి, అధికార ప్రతినిధి మహమ్మద్ షౌకత్ అలీ, లక్ష్మణ చారి, సిహెచ్ రాజీవ్, సంతాజి గారి సుధాకర్ రావు, రాజేందర్, రాఘవేందర్‌గౌడ్, రాజప్ప, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యవ్యవస్థలను దెబ్బతీస్తుంది..

దోమకొండ : మండలంలోని సంగమేశ్వర్, సీతారాంపూర్, గ్రామలలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తు, అప్రజాస్వామ్య పాలన కోసాగిస్తుందన్నారు. రాజ్యాంగం ప్రకారం, ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడుతూ గౌరవిస్తూ, పాలన చేయాల్సిన పాలకులు నేడు ఆ వ్యవస్థలను నాశనం చేస్తూ తమ ఆధీనంలో తీసుకొని ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాలరాస్తున్నారని ఆవేదన చెందారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ప్రతి భారతీయుని ప్రస్తుత కర్తవ్యమని పిలుపునిస్తూ పాదయాత్ర చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తీగల తిరుమల గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్‌లు పోగుల సాయిలు, గోపాల్ రెడ్డి, నల్లపు శ్రీనివాస్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రెంజల్ : మండలంలోని వీరన్నగుట్ట, వీరన్నగుట్ట తండా, అంబేద్కర్ నగర్ గ్రామాలలో కాంగ్రెస్ పాదయాత్రకు విశేష స్పందన వచ్చింది. కాంగ్రెస్ నాయకులు, యువజన నాయకులు, మహిళల ఆధ్వర్యంలో పాదయాత్ర కొనసాగింది. భారత రాజ్యాంగ రచయిత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను కొందరు నాయకులు దూషించడం సరికాదన్నారు. ఆయా గ్రామాలలోని అంబేద్కర్, చిత్రపటాలకు పూలమాలలు వేసి ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షులు మొబిన్ ఖాన్, మండల ఇంఛార్జి సుమన్, నాయకులు సాయిరెడ్డి, సిహెచ్ రాములు, జావీద్ ఉద్దీన్, ధనుంజయ, సాయిబాబాగౌడ్, గణేష్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై బోల్తాపడ్డ డీసీఎం

నవతెలంగాణ-సదాశివనగర్



మండలంలోని మర్కల్, సదాశివ నగర్ గ్రామాల మధ్యలో కొబ్బరి బొండాల వ్యాను బోల్తా పడ్డట్టు పోలీసులు శనివారం తెలిపారు. పోలీసు వివరాల ప్రకారం.. డీసీఎం రాజమండ్రి నుంచి నిజామాబాద్ వెళ్తుండగా ఈ సంఘటన చోటు చేసుకున్నట్టు తెలిపారు. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదాలు జరగలేదని పేర్కొన్నారు.

కోసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

- బిజెపి రాష్ట్ర నాయకులు నూతుల శ్రీనివాస్

నవతెలంగాణ-మాక్లూర్

కోసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని బిజెపి రాష్ట్ర నాయకులు నూతుల శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆలూర్ మండలంలోని గుత్ప, మాక్లూర్ మండలంలోని అడవి మామిడిపల్లి ధాన్యం కుప్పలను భారతీయ జనతా కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు నూతల శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బిజెపి అధికార ప్రతినిధి జస్సు అనిల్, పులి యుగంధర్, అల్జాపూర్ రాజేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

టీజీ డీజీఏలో ఇద్దరు వైద్యులకు చోటు

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీ జిడిఏ)లో జిల్లాలోని పట్టణానికి చెందిన ఇద్దరు సీనియర్ వైద్యులకు చోటులభించింది. ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగా డిప్యూటీ డిఎంహెచ్వో రమేష్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యునిగా డిఎంహెచ్ఓ కార్యాలయంలో పనిచేస్తున్న డీఎస్ఓ నాగరాజు నియమితులయ్యారు. ఈ సందర్భంగా శనివారం పట్టణానికి చెందిన పలువురు వైద్యులు హర్షం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే సమక్షంలో సొసైటీ డైరెక్టర్ జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండల కేంద్రంలో శనివారం రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ నాయకుడు, స్థానిక సింగిల్ విండో డైరెక్టర్ రేంజర్ల మహేందర్ జన్మదిన వేడుకలను ఆ పార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ ఏర్పాటు చేసిన జన్మదిన కేక్‌ను రేంజర్ల మహేందర్ చేత ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి స్వయంగా కట్ చేయించి, కేక్ తినిపించారు. ఈ సందర్భంగా మహేందర్ కు ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి తన చేత స్వయంగా కేక్ కట్ చేయించడం పట్ల జన్మదినం జరుపుకున్న రేంజర్ల మహేందర్ సంతోషం వ్యక్తం చేశారు. తన జన్మదిన వేడుకలు నిర్వహించిన బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రేగుంట దేవేందర్ కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రాజా గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఏనుగు గంగారెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మైలారం సుధాకర్, అంగరి రాజేశ్వర్, మాజీ సర్పంచ్ గడ్డం స్వామి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కేవీపీఎస్ ఆధ్వర్యంలో జగ్జీవన్‌రాం జయంతి

నవతెలంగాణ-కంఠేశ్వర్



బాబు జగ్జీవన్ రాం జయంతి సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండగంగాధర్ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 118 వ జయంతి సందర్భంగా కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఈ నెల మాసంను మహనీయుల మాసంగా ప్రకటించి మహనీయుల జయంతులు వర్ధంతిలు అదేవిధంగా ప్రతిఘటన పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు.

గద్దెను ధ్వంసం చేసి శిలాఫలకాన్ని ఎత్తుకెళ్లిన వ్యక్తి అరెస్టు

నవతెలంగాణ-డిచ్‌పల్లి



ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామం శివారులో ప్రభుత్వం నూతనంగా నిర్మించ తలపెట్టిన 33/11 కేవీ సబ్ స్టేషన్ శంకుస్థాపన పనులు జరుగుతుండగా ఆ సబ్ స్టేషన్ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి శిలాఫలకం గద్దెను ధ్వంసం చేసి శిలాఫలకాన్ని ఎత్తుకెళ్లిన వ్యక్తిని శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్‌హెచ్ఓ మనోజ్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. తిర్మన్‌పల్లి గ్రామ శివారులో ప్రభుత్వం నూతనంగా నిర్మించ తలపెట్టిన 33/11 కేవీ సబ్ స్టేషన్ శంకుస్థాపన సమయంలో ఆ సబ్ స్టేషన్ భూమిలోకి అక్రమంగా ప్రవేశించి శిలాఫలకం గద్దెను ధ్వంసం చేసి శిలాఫలకాన్ని ఎత్తుకెళ్లిన తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన మేకల క్రాంతి కుమార్‌పై చర్యలు తీసుకోవాలని టిజిఎన్‌పిడిసిఎల్ ఎఈఈ బొల్లు పండరీనాథ్ ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు. కేసు దర్యాప్తు అనంతరం తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన మేకల క్రాంతిని ఇందల్‌వాయి పోలీసులు పట్టుకొని తదుపరి చర్యల నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు. ఎవరైనా వ్యక్తులు ప్రభుత్వ భూమిలోకి అక్రమంగా ప్రవేశించినా, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినా అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్‌హెచ్ఓ మనోజ్ కుమార్ హెచ్చరించారు.

సొమ్ము కేంద్రానిది.. సోకు రాష్ట్రానిది

- బిజెపి నాయకుల ఫ్లెక్సీ ప్రదర్శన

నవతెలంగాణ-లింగంపేట్



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

సన్న బియ్యం పథకం కేంద్రం దేని సోకు మాత్రం రాష్ట్రం ప్రభుత్వం చేస్తుందని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు బొల్లారం క్రాంతి కమార్ మండిపడ్డారు. శనివారం మండల కేంద్రంలోని చౌక ధరలు దుకాణానికి వెళ్లి ఫ్లెక్సీని ప్రదర్శించారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు మాట్లాడుతూ.. సన్న బియ్యం పథకం కింద కరోనా సమయం నుంచి 5 కిలోల రేషన్ బియ్యం ఫ్రీగా కేంద్ర ప్రభుత్వం ఇస్తుందన్నారు. ఇప్పుడు దేశంలో అందరికి సన్న బియ్యం అందాలని సన్న బియ్యం పథకం కేంద్ర ప్రభుత్వం ప్రారంబించారు. ఐదు కిలోలు 5 కిలోలు కేంద్రం వాటా రూ.40 కేంద్రం ఇస్తే 1కిలో రాష్ట్రం వాటా రూ.10 శాతం మొత్తం ఒక మనిషికి ఆరు కిలోలు ఇస్తుందన్నారు. ప్రతి ఒక్కటి కేంద్రం డబ్బులతోనే వడ్లు కొనుగులు, బస్తాల ఖర్చు, సుతీల్ తాడు, ఇంకా చాలా ఖర్చులు అన్ని కేంద్రమె భరిస్తుందని తెలిపారు. కానీ రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి నేనే ఇస్తున్నానని జనాలను పిచ్చోళ్లని, వెర్రి వెంగళప్పలని చేస్తున్నాడన్నారు. ఇలాంటి దుష్ప్రచారాలు మానుకొని ప్రజలకు ఇచ్చినటువంటి హామీలను నెరవేర్చి చూపాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్, విష్ణు మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు రాజారం బాలయ్య, మండల ఓబీసీ మోర్చా అధ్యక్షులు అంద్యాల ఉదేష్, మండల కిసాన్ సన్ అధ్యక్షులు చేపూరి పోశెట్టి, బీజేవైఎం మండల అధ్యక్షుడు రజనీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

కలసి ఉండాలి.. కల్తీ అమ్మొద్దు

- ఎక్సైజ్ సిఐ మధుసూదన్ రావు

నవతెలంగాణ-తాడ్వాయి

ముస్తేదారులు కలసి ఉండి.. కల్తీ అమ్మొద్దని ఎక్సైజ్ సిఐ మధుసూదన్ రావు అన్నారు. శనివారం మండలంలోని ఎర్ర పహాడ్ గ్రామంలో ఎల్లమ్మ ఆలయం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సంధ్బంగా ఆయన మాట్లాడుతూ.. గత కొన్ని రోజుల నుంచి గ్రామంలోని ముస్తేదారులు చిన్నపాటి గొడవలతో ఐక్యంగా లేరని ఇరు వర్గాలకు చెందిన ముస్తేదారులకు పలు సూచనలు చేశారు. కల్తీ కల్లు విక్రయించి పేద ప్రజల ప్రాణాలకు హాని కలిగియొద్దని కలిసి ఉండి కల్లు విక్రయిస్తూ కుటుంబాలు పోషించు కోవాలన్నారు. చిన్నపాటి గొడవలు అయితే సంఘంలో పరిష్కరించుకోవాలని సూచించారు. కల్తీ కల్లు అమ్మినట్టు తమ దృష్టికి వస్తే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామన్నారు. కార్మికులకు ప్రభుత్వం అందజేసే పథకాలు పొందేందుకు తమ దృష్టికి తీసుకువస్తే సహకరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై దీపిక, పోలీసు సిబ్బంది, గ్రామ ముస్తేదారులు పాల్గొన్నారు.

రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలి

- ఏఎంసి వైస్ చైర్మన్ పరమేష్ పటేల్
- ధాన్యం కొనుగోలు క్రేంద్రం ప్రారంభం



ఏఎంసి వైస్ చైర్మన్‌ను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-మద్నూర్

రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రంలోనే విక్రయించాలని ఏఎంసి వైస్ చైర్మన్ పరమేష్ పటేల్ అన్నారు. శనివారం డోంగ్లి మండల పరిధిలోని కుర్లా గ్రామ పరిధిలో ఐకెపి మహిళా సంఘం ఆధ్వర్యంలో మద్దతు ధర ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యంకు బోనస్ రూ.500 అందజేస్తున్నారు. రైతులు ధాన్యంను ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలోనే విక్రయించి గిట్టుబాటు ధర పొదాలన్నారు. అలగే బోనస్ కూడా పొందానలి కోరారు. కార్యక్రమంలో ఐకెపి ఎపిఎం రవీందర్, ఏఈఓ సమరిన్ కుర్లా మాదన్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

మహారాష్ట్ర, అదిలాబాద్ జిల్లాల నుంచి పాదయాత్ర

నవతెలంగాణ-తాడ్వాయి

మహారాష్ట్ర, అదిలాబాద్ జిల్లాల నుంచి 400 మంది భక్తులు పాదయాత్రగా శనివారం మండల కేంద్రంలోని శబరిమాత ఆశ్రమానికి చేరుకున్నారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో పాల్గొని మొక్కలు తీర్చుకునేందుకు గత 20 సంవత్సరాలు నుంచి అదిలాబాద్, బోత్, మహారాష్ట్ర, బెల్లూర్, దేగాం, జన్నూర్, ప్రాంతాల నుంచి పాదయాత్రగా వస్తున్నట్టు భక్తులు తెలిపారు. గతనెల 31న పాదయాత్రగా బయలుదేరి నేడు ఆశ్రమానికి చేరుకున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో గట్టయ్య, హనుమాన్లు, బాలన్న, గంగారెడ్డి, సకలి, రామవ్వ, పాల్గొన్నారు.

డీఏలు, పీఆర్సీలను వెంటనే ప్రకటించాలి

- టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్



జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని వశిష్ఠ డిగ్రీ కళాశాలలో టిపిటిఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో బాబు జగ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చకినాల అనిల్ కుమార్ హాజరై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు బకాయి పడిన నాలుగు వాయిదాల డిఎను, జులై 2023 నుంచి అమలు చేయాల్సిన పీఆర్సీని అడగొద్దని, అవి కావాలంటే నెలనెలా జీతాలే ఇవ్వలేమని రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించటాన్ని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు. సగం మంది ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు మాత్రమే నెల మొదటి తేదీన వేతనాలు ఇవ్వడం మినహా మరే సమస్య పరిష్కారం కాలేదన్నారు. వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ నాగభూషణం, జిల్లా ఉపాధ్యక్షురాలు నలినీదేవి, జిల్లా కార్యదర్శి సిహెచ్ లక్ష్మి, నరేందర్, ప్రకాష్, గోప్ శ్రీనివాస్, నారాయణ, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందేయత

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని పోల్కంపేట గ్రామానికి చెందిన నవీన్‌కుమార్ కుటుంబానికి శనివారం ఆర్థిక సాయం అందజేశారు. మృతుడు గ్రామంలోని మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యుడు. ఇటీవల ఆకస్మికంగా మరణించిన నేపథ్యంలో వారి కుటుంబ సభ్యులకు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం రూ.5వేలు ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు చింతకుంట రాజు, కార్యదర్శి మర్రి వెంకటేశం, కోశాధికారి శ్రీనివాస్, సంఘ సభ్యులు బండ మహేష్ బాసు, మొగులయ్య, తదితరులు పాల్గొన్నారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల కేంద్రంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి మాదిగ సంఘం నాయకులు శనివారం పాలాభిషేకం చేశారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.